ఓంశ్రీసాయిరామ్

# శ్రీకృష్ణుడు

*దేవకీవసుదేవులకు కారాగారమున జన్మించి, నందయశోదలయింట వ్రేపల్లెలో పెరిగిన వెన్నదొంగ ఈ కృష్ణుడు. పుట్టినదాదిగా ఇతని చర్యలు మానవాతీతములై, ఆశ్చర్యకరములై కన్నవారికీ విన్నవారికీ వింతలు కలిగించుచుండెడివి. రూపమునకు బాలుడుగాని ప్రతాపమునకు మహావీరుడు. తనను పట్టుటకై కంసుడు పంపిన అనేక దూతలను హతమార్చి గుట్టును కనిపెట్టి పొట్టలు చీల్చెను. వ్రేపల్లెలో నిత్యమొక ఆశ్చర్య అద్భుత లీలను జరుపుచుండెను. రాళ్లవర్షముచే బాధపడుచున్న గోపగోపికలను, గోవులను రక్షించుటకై బుజ్జి చిటికిన వేలుపై కొండనెత్తి గోకుల వాసులకు గోపాలుడిట్టి మానవాతీతుడను సత్యమును నిరూపించెను. కాళీయుని గర్వమణచి తలపై నృత్యము చేసెను. కంసభూపాలుని బంతివలె యెగరవేసి చంపెను. మహామహా పరాక్రమశాలురు, రాక్షసశక్తిసంపన్నులు అయిన జరాసంధ, దంతవక్త్ర, శిశుపాల, నరకాసుర యిత్యాది రాక్షసశూరులను డొక్కలుచించి డోలువలె వాయించెను. ప్రజలను రాక్షస రాజులనుండి రక్షించెను. ధూర్తులైన ధృతరాష్ట్ర పుత్రులను రూపుమాపుటకై పార్థునకు సారధిగా నిరాయుధుడై నిలచి ధర్మమూర్తులైన పాండవుల విజయమునకు కీర్తిని సార్థకము గావించెను. అన్యాయ, అక్రమ, అధర్మ, అనాచార ప్రవర్తనలను అణుమాత్రములో అణగద్రొక్కి నమ్మిన పాండవులను కంటికి రెప్పవలె కాపాడెను. రుద్ర భూమియందూ, భద్రభూమియందూ రౌద్రమనునది లేక, విచారమనునది చూపక ఉల్లాసముతో చెల్లాటమాడుచుండెడివాడు. సర్వోపనిషత్ సారమైన గీతను, యుద్ధమునకు పూర్వము అర్జునుని నిమిత్తమాత్రునిగా చేసుకొని లోకానికి అందించిన జ్ఞానమూర్తి ఈ కృష్ణమూర్తి.*

*సర్వసృష్టి తనయందే ఉన్నదనియు, సృష్టికి తానే కర్తననియు విశ్వవిరాట్ రూపమున అర్జునునకు సాక్షాత్కరించెను. జగత్తు, జగదీశుడు వేరుకాదనియు రెండింటికి బింబప్రతిబింబ సంబంధమనియూ నిదర్శన రూపములైన ప్రదర్శనలు జరిపించెను. ధర్మమును కర్మలద్వారా నిరూపించమని బోధించి తాను చేసి చూపించెను. గోపాలుడు నిరంతరమూ కిలకిల, కళకళలాడుచుండెడివాడేగానీ పొంగి కృంగెడివాడు కాదు. అన్నింటియందూ ఉండియూ దేనితోనూ చేరక అంటక ఉండెడివాడు. అతని అన్ని చర్యలూ ఆధ్యాత్మికములే, అంతరార్థములే, అద్భుతములే, లోకాలనేలే గోపాలుడు భూపాలనకై ఈ రూపమును దాల్చెను. లేకున్న ఆకారమే లేనివానికి యేపేరని చెప్పవీలగును! భక్తిప్రపత్తులు గోపాలుని ద్వారానే లోకానికి ప్రాకెను. గోపికలు తరించిరి. లోకులు స్మరించిరి. అట్టి యాదవకుల భూషణుడు, బృందావన సంచారకుడు, గోపీజనవల్లభుడు, మధురాపురవిహారి, ద్వారకస్థాపకుడు ఈ కృష్ణుడే. ఇతడే లోకుల కష్టములను తీర్చి జన్మలు సార్థకము గావించు సమర్థుడు, గీతాస్థాపకుడు.*

భారతదేశము పేరు వినగానే హిమాలయాలు గుర్తుకు వస్తాయి. శతాబ్దముల తరబడి హిందూజాతికి ప్రమాణములైన సత్యాహింసలకు ప్రతీకలైయున్న పర్వతములే ఈ వెండికొండలు. మహనీయులు, మహర్షులు తపస్సు లాచరించిన ప్రదేశమే హిమాలయ పర్వతములు. సత్యము, ధర్మములవలె పరిశుద్ధమై మానవునికి ఆదర్శప్రాయముగా ఈ కొండలు కనిపిస్తాయి. ఈ పర్వతములను చూచినప్పుడు, 'మేఘములు కప్పుకొని మాధవుని ధ్యానిస్తున్నవా?' అని అనిపిస్తుంది. ఏ పర్వతములందు ఋషులు తపస్సు ఆచరించిరో, ఆ పర్వతములయందే గంగ పుట్టినది. ఈ గంగా ప్రవాహరూపమున నున్నదే హిందూజాతి. గంగ ప్రతి మానవుని హృదయమున రక్తనాళములుగా ప్రవహించే ప్రతిబింబము. గంగ పేరు విన్నంతనే గంగకు యిరుప్రక్కల వున్న పవిత్రమైన క్షేత్రములు, తీర్థరాజములు, సంగమములు మనకు గుర్తుకు వస్తాయి. కాశీ, ప్రయాగ, హరిద్వార్, హృషీకేశ్‌వంటి పవిత్రమైన క్షేత్రములు కంటికి కనిపిస్తాయి. దేహములో ప్రవహించే రక్తనాళములు గంగ అయినప్పుడు, దేహములోని మనస్సు, బుద్ధి, చిత్తము, అంతఃకరణము అనే క్షేత్రములను గుర్తించక తప్పదు. పుణ్యక్షేత్రములయందు పవిత్రమైన భావములు, పవిత్రమైన కర్మలు ఆచరిస్తూ ఉంటారు. కనుక, మన అంతః ప్రవాహమైన రక్తనాళములనే గంగకు యిరుప్రక్కల మనస్సు, బుద్ధి, చిత్తము, అంతఃకరణములయందు పవిత్రమైన భావములు, నిర్మలమైన చింతనలు అవలంబించుట కర్తవ్యము. పవిత్రమైన గంగా ప్రవాహపు ఈ అంతరార్థమును గుర్తింపచేసే

పవిత్రమైన దేశమునకు భరతదేశమను పేరు సార్థకనామము. భారతదేశము అన్న పేరు విన్న తక్షణమే మహాభారతముకూడా జ్ఞాపకము వస్తుంది. భారతమునకు కథానాయకుడు కృష్ణుడు.

అవతారమూర్తి శ్రీకృష్ణునికి ఎంత చక్కని పేరు! దానికి ఎంతో పవిత్రమైన అర్థమున్నది. కృషి, ఆకర్షణ, త్రికాలాబాధితానందము. ఈ మూడు అర్థములు ఆ పదమునకున్నవి. హృదయభూమిని దున్ని, ప్రేమబీజములు నాటి, ఆనందమును పండించేది కృష్ణావతార కార్యము. ఆబాలగోపాలము అందరినీ ఆకర్షించి, వారి చిత్తములనపహరించి, మనోలయమొనగూర్చి కాపాడే మూర్తి అని మరొక అర్థము. సచ్చిదానందస్వరూపుడు, మాటలతో పాటలతో ఆటలతో వేణుగాన మాధుర్యముతో ఆనందమునందించాడు కృష్ణుడు. భద్రభూమిలోను, రుద్రభూమిలోను ఆనందగానమే ఆయనకలవాటు. మహాభయంకరమైన భారతయుద్ధ క్షేత్రమున చక్కగా, శాంతముగా, నెమ్మదిగా గీతను పాడినాడు. కృష్ణుడు ఆనంద స్వరూపుడే!

సమత్వమనే భావము లోకములో ఈనాడు వ్యాపించినట్లు భావిస్తున్నారు. కాని అది ఈనాటిది కాదు. ఏబది శతాబ్దములకు పూర్వము సోషలిజము అనేదానిని స్థాపించిన సామాజికమూర్తి ఆ కృష్ణమూర్తి. నవభారత సమాజమును స్థాపించుటకు మూలాధారమైన చరిత్రపురుషుడు శ్రీకృష్ణుడు. కార్మికుని, కర్షకుని, విజ్ఞానినికూడా సమానముగా భావించి వారికి తగిన కర్తవ్యకర్మలను నియమించి, తద్వారా లోకవినాశకులు, ద్రోహులైన రాజకీయ నాయకులను, సాంఘిక ద్రోహులను ఖండించి కిరీటములేని మహారాజుగా ఏలినమూర్తి ఈ కృష్ణమూర్తి. ప్రాచీన కాలమునుండి కృష్ణుని 'గోపాల' అని పిలుచుట పవిత్రమగా భావిస్తున్నాము. గోవు అనగా పశువు అనుకుంటున్నారు, కాదు, కాదు. ఆహారమును అందించి, వ్యవసాయమునకు తోడ్పడి, పాడిపంటలనిచ్చే జీవులను గోవులని పిలుస్తున్నారు. గోవులను పోషించేవారంతా గోపాలురే! ప్రపంచమునకు సరైన సంపద గోవులని విశ్వసించాడు కృష్ణుడు. గోవులే సరైన సంపద అని, గోవులవలన ఆహారమును ఉత్పత్తి చేయవచ్చునని, ఈ ఆహారముపైనే దేశ సౌభాగ్యము ఆధారపడి ఉన్నదని ఆనాడే గుర్తించి సోషలిజమును తాను ఆచరణ పూర్వకముగా అనుభవించి లోకమున వెల్లడి చేసినాడు కృష్ణుడు. గోవుద్వారా పాలు, పెరుగు, వెన్న, నెయ్యి, యిత్యాది ఆహార పాదార్థములు పొందుటయే కాక, గోవుల సంతతియైన పశువులను వ్యవసాయమునకు ఉపయోగించుకొని పంటలను అభివృద్ధి గావించి లోకమునకు కళ్యాణమును అందించినాడు కృష్ణుడు. సోదరులైన బలరామకృష్ణులు పాడిపంటలను రెండు విభాగములుగా భావించుకున్నారు. పాడి గోపాలుడు, పంట బలరాముడు. వారు పాడిపంటల ద్వారా లోక కళ్యాణము కలిగించినారు. పాడిపంటల ద్వారా లోకమునకు ఆనాడు సౌభాగ్యము కలిగింది. లోకమునకు సౌభాగ్యము ఆకాశమునుండి ఊడిపడేది కాదు. భూమినుండి పుట్టేది కాదు, లేదా మధ్యలో అందుకొనేది కాదు. సోమరితనము దూరము చేసి నడుము వంచి పనిచేసే తత్త్వమును నిరూపించినారు.

ఐదు వేల సంవత్సరములకు పూర్వము ద్వాపరయుగ మధ్యమంలో ధనమధాంధులైన రాజులు మానవాకారం ధరించిన రాక్షసులవలె ప్రవర్తిస్తూ ప్రజలను అనేకవిధములుగా హింసించ సాగారు. వారి హింసలను భూదేవి భరించుకొనలేక భగవంతుని వద్దకు వెళ్ళి రక్షించమని ప్రార్థిస్తూ వచ్చింది. భగవంతుడు ఆమె శోకమును నివారించే నిమిత్తమై, 'దేవీ! నీవు వెళ్ళు, మిగిలినది నేను చూసుకుంటాను. ఇక నీకేమాత్రము భారమునివ్వను' అని ధైర్యము చెప్పి వెనుకకు పంపాడు. తదుపరి దేవతలను పిలిపించి, 'మీరందరూ భూలోకంలో యాదవులుగా జన్మించండి' అని శాసించాడు.

యదు అనేవాడు యయాతి ప్రథమ పుత్రుడు. ఈ యదు సంతతతి వారే యాదవులు. ఈ యాదవులలో ముఖ్యుడు ఆహుకుడు. ఇతడు ధర్మపరాయణుడు, సత్యవ్రతుడు. ఇతనికి దేవకుడని, ఉగ్రసేనుడని యిరువురు కుమారులు. దేవకుని కుమార్తె దేవకి. ఉగ్రసేనుని కుమారుడు కంసుడు. కంసుని స్వంత సోదరీమణులు లేరు. కనుక, తన పినతండ్రి కుమార్తె దేవకిని తన స్వంత చెల్లెలుగా భావించి అత్యంత ప్రేమతో ఆదరిస్తూ వచ్చాడు. ఈ యాదవులందు శూరుడనే వ్యక్తి ఉండేవాడు. ఇతని కుమారుడే వసుదేవుడు. ఇతడు సామంతరాజు. ఆడిన మాట తప్పేవాడు కాదు. ఇతనికే దేవకీదేవినిచ్చి వివాహము గావించాలని ఉగ్రసేనుడు, కంసుడు యిరువురూ నిర్ణయించుకున్నారు. ఐతే, వసుదేవునికి

మొదట రోహిణి అనే భార్య ఉండేది. కాని, అతనికి బిడ్డలు లేకపోవుటచేత మరల వివాహమాడాడు. వివాహమైన కొంతకాలమునకు సోదరిని వసుదేవుని ఇంటికి తీసుకొనిపోయే నిమిత్తమై కంసుడు రథమును సిద్ధం చేసాడు. దేవకి అంటే కంసునకు రెండవ ప్రాణము. అట్టి తన చెల్లెలిని అత్తగారింటికి పంపే సమయంలో కొంత దుఃఖముతో, కొంత ఆనందముతో రథమును తోలుతూ వచ్చాడు. ఈ ప్రశాంత వాతావరణములో ఆకాశమునుండి ఒక పెద్ద శబ్దము వినిపించింది. 'మూర్ఖుడా! నీ ప్రాణములను హరించువాడు దేవకీదేవి అష్టమగర్భములో పుట్టబోతున్నాడు' అని ఆకాశవాణి పలికింది. ఈ మాటలు విన్న కంసుడు మహా ఉగ్రుడయ్యాడు. రథము నుండి దూకాడు. వెనుక కూర్చున్న దేవకి కొప్పు పట్టి క్రిందకి లాగాడు. కత్తి తీసి ఆమె గొంతు కోయటానికి సిద్ధమైనాడు. వసుదేవుడు మహా శాంతస్వభావుడు. అతడు కంసుని రెండు చేతులూ పట్టుకొని, 'కంసా! నీ మరణము అష్టమ గర్భమున జన్మించిన కుమారుని వల్ల సంభవిస్తుందిగానీ, దేవకి వల్ల జరుగుతుందని ఆకాశవాణి చెప్పలేదు కదా! అష్టమ గర్భము రావటానికి యింకా యెంతోకాలముంటున్నాది. కనుక, ఈ తొందరపాటు నీకు మంచిది కాదు. ఇంతకాలమూ ప్రాణసమానంగా ప్రేమించిన నీ సోదరిని వదలు. ఆమెకు పుట్టిన ప్రతి బిడ్డను నీకు అప్పజెప్పుదును' అని వాగ్దానము చేసేటప్పటికి కంసుని కోపం చల్లారిపోయింది. అక్కడనుండి కంసుడు వెనుకకు వచ్చాడు. మళ్లీ రథము నందు కూర్చోలేదు. ఇంక భారమైన హృదయంతో దేవకీవసుదేవులు తమ గృహము చేరుకున్నారు.

కాలము గడచుచుండగా దేవకీవసుదేవులకు పుట్టిన మొదటి ఆరుగురు శిశువులను కంసుడు నారదుని సలహా మేరకు సంహరించాడు. దేవకీదేవి ఏడవ గర్భము ప్రారంభమైంది. భూదేవికిచ్చిన మాట నిలబెట్టుకొనే నిమిత్తమై నారాయణుడు అన్ని యేర్పాట్లు చేస్తూవచ్చాడు. దేవతలందరూ యాదవులుగా పుట్టారు. తన యోగమాయను పిలిచి తక్షణమే వెళ్ళి గోకులములోనున్న యశోద గర్భములో ప్రవేశించమన్నాడు. తాను దేవకీదేవి గర్భములో ప్రవేశించనున్నట్లుగా తెలియజేశాడు. కాని, అప్పటికి ఏడవ గర్భము యింకా పూర్తి కాలేదు. కనుక, దానిని సంకర్షణము గావించాడు. అనగా, దానిని మార్చి రోహిణీదేవి గర్భములో ప్రవేశింపచేశాడు. రోహిణి గర్భములో ఆదిశేషుడు ప్రవేశించాడు. దేవకియొక్క ఏడవ గర్భము ఫలించలేదని అందరూ చెప్పుకొన్నారు. రోహిణి వసుదేవుని మొదటి భార్య. కంసుడు పిల్లలను చంపుతున్న విషయాన్ని గుర్తించిన వసుదేవుడు రోహిణి తన యింటిలో ఉండటం మంచిది కాదని తలంచి ఆమెను యశోద యింటికి పంపించాడు. రోహిణి యశోదయొక్క సోదరియే.

ఎనిమిదవ గర్భములో నారాయణుడు ప్రవేశించి దినదినాభివృద్ధి నొందసాగాడు. భగవంతుడు మానవాకారమును ధరించినప్పుడు అతని లీలలను, శక్తిసామర్థ్యములను గుర్తించటం చాలా కష్టము. దేవకియొక్క అష్టమ గర్భములో పుట్టినవాడు తనకు అపాయము కలిగించుననే భయముతో కంసుడు దేవకీవసుదేవులను చెరసాలలో పెట్టించాడు. అంతేకాదు, ద్వారములకు చాలా భద్రమైన బీగములను తగిలించాడు. బలవంతులైన సిపాయిలను కాపాలాకై నియమించాడు. అష్టమి, రోహిణి, ఈ రెండూ చేరిన సమయములో దేవకీదేవి ప్రసవించింది. జ్యోతిశ్శాస్త్రము పురస్కరించుకొని కృష్ణుడు పుట్టిన దినమును సరిగా నిర్ణయించ వచ్చును. జూలై 20వ తేదీ క్రీస్తుపూర్వము 3228వ సంవత్సరము. శ్రీముఖనామ సంవత్సరము శ్రావణ బహుళ అష్టమి రోహిణి నక్షత్రమందు అర్థరాత్రి 3 గంటల సమయమందు కృష్ణుని జననము. ఇది సరైన దినము. అతడు సామాన్య బాలుడు కాదు. అద్భుతమైన తేజస్సుతో, అన్ని విధములైన అలంకారములతో జన్మించాడు. వక్షస్థలముపై శ్రీవత్సము కనిపించింది. కౌస్తుభమణి మెరిసింది. దేవకీదేవులు తమ జన్మ సార్థకమైనదని ఆనందించారు. 'మా అదృష్టవశాత్తు మాకు పుత్రునిగా జన్మించావు. కాని, నిన్ను రక్షించుకోలేక పోతున్నాము. కనుక, నీవేదైనా మాయను కల్పించి నిన్ను వేరే ప్రదేశమునకు గొనిపోయే పరిస్థితిని కలిగించు' అని ప్రార్థించారు. వసుదేవుడు నిర్మలహృదయుడు, తాను కూర్చొని కన్నులు మూసుకొని ధ్యానించాడు. ప్రక్కనే వెదురుబుట్ట కనిపించింది. దానిలో ఆ బిడ్డను పెట్టుకొని తలుపులవైపు చూశాడు. అతని దృష్టి ప్రసరించిన తక్షణమే ఒక్కసారిగా తలుపులు తెరువబడ్డాయి! దైవలీలలు ఎంత విచిత్రమైనవి! అక్కడి సిపాయిలందరూ గాఢనిద్రలో ఉండినారు. వసుదేవుని ఎవ్వరూ చూడలేదు. తలుపులు తెరువబడిన

సంగతి ఎవ్వరికీ తెలియదు. వసుదేవుడు చెరసాల దాటి వచ్చేటప్పటికి కుంభవృష్టి కురుస్తున్నాది. యమున నిండుగ ప్రవహిస్తున్నది. 'నారాయణా! నీ నిమిత్తమై నేను ప్రయాణం పెట్టుకొన్నాను. దీనికి అడ్డు తగలకుండా చూడు' అని ప్రార్థించాడు. వెంటనే యమునానది దారి విడిచింది. వసుదేవుడు నందుని యింటికి చేరుకొన్నాడు. అప్పుడే యశోద ప్రసవించింది. మాయాదేవి జన్మించింది. ఆసమయంలో యశోదానందులు తన్మయులై నిద్రిస్తున్నారు. తాను తెచ్చిన మగబిడ్డను అక్కడ పెట్టి యశోదకు పుట్టిన ఆడబిడ్డను బుట్టలో వేసుకొని వసుదేవుడు తిరిగి మథురకు చేరుకొన్నాడు. అతడు చెరసాలలో తిరిగి ప్రవేశించేటప్పటికి ఆడబిడ్డ కెవ్వున ఏడ్చింది. దానితో సిపాయిలందరూ మేల్కొన్నారు. ఈ వార్తను కంసునికి తెలిపారు. దానికోసమే కాచుకొని ఉన్న కంసుడు పరుగెత్తుకొని వచ్చి దేవకీదేవి చేతియందున్న బిడ్డను తీసుకొని పైకి ఎగురవేసి కత్తితో కొట్టడానికి ప్రయత్నించాడు. వెంటనే మాయాదేవి, 'మూర్ఖుడా! దైవ సంకల్పము నీకు తెలియదు. నిన్ను హతమార్చేవాడున్నాడు. అతనిని చంపుటకు ఎవరి తరమూ కాదు. ఇది చక్కగా యోచించు. వినాశ కాలే విపరీత బుద్ధిః నీకు ఈ విపరీత బుద్ధి పుట్టటానికి నీ వినాశనమే కారణము. నీవు యేమాత్రము తప్పించుకోలేవు. భగవంతుడు కార్యకారణ స్వరూపుడు. అట్టి కార్యకారణ స్వరూపుడైన భగవంతుని చిత్రములను నీవు అర్థము చేసుకోలేవు' అని చెప్పి అంతర్ధానమైంది. ఆనాటినుండి కంసుడు తనను చంపటానికి పుట్టిన పిల్లవాడు ఎక్కడున్నాడో తెలుసుకోటానికి ప్రయత్నించాడు. అహంకార మమకారములచేత గ్రామములలో పుట్టిన పిల్లలందరినీ చంపుతూ వచ్చాడు. నిరపరాధులను కూడా హింసిస్తూ వచ్చాడు. ఇదంతా ఎందుకు జరగాలి అని కొంతమందికి సందేహము రావచ్చును. కానీ, ఇవన్నీ రాక్షస సంహారమునకు పునాదులు. చిన్న పిల్లలు యేమి చేశారు? వారు యే పాపము యెరుగరే! అలాంటి పిల్లలనంతా ఎందుకిలా చంపించటం భగవంతుడు? చావు దేహమునకే గాని ఆత్మకు లేదన్నారు. ఏనాటికైనా చావు తప్పునది కాదన్నారు. కేవలము తన సంకల్పము చేతనే సృష్టించి, తన సంకల్పము చేతనే అంత్యమొందిస్తూ వచ్చాడు. ఈవిధమైన సంకల్పములు అర్థము చేసుకోలేము.

కృష్ణుడు అంత నలుపూ కాదు, అంత తెలుపూ కాదు! మూడు భాగములు నలుపు, ఒక భాగము తెలుపు కలుపుతే ఎంతో అంత, అతనిది శ్యామల రూపము! నందుడు వైష్ణవుడు కాబట్టి, అబ్బాయికి స్నానము చేయించి ఒకే ఒక గీత కస్తూరీ తిలకము పెట్టేవాడు. నందుని తల్లి, ఆమెయొక్క కంఠాభరణమును శ్రీకృష్ణునికి ధరింపచేసేది. అదే కౌస్తుభము. ఆ కాలములో దానికి గొప్పవెల! ఆ పతకము మధ్య ఒక పెద్ద పచ్చ, మరకత రత్నము వుండెను. దానిచుట్టూ విలువైన వజ్రములు పొదగబడినవి. అది శ్రీకృష్ణుని వక్షస్థలమందు తళతళ లాడుతూ వుండేది.

అవతారములుకూడ మాయాశక్తికి లొంగినట్లు నటించును. మానవ ప్రక్రియలను బహిరంగముగా ప్రదర్శించక అవతార కార్యక్రమములు జరగవు. బాలకృష్ణుని తొట్టిలో పరుండబెట్టి యశోదాదేవి జోలపాట పాడుతూ, కథలు చెప్తుతూ నిద్రింపజేయుట అలవాటు. ఒక దినము, 'అనగనగ' అని ప్రారంభించి దశరథమహారాజుకు నలుగురు కుమారులు పుట్టుట, రాముని పట్టాభిషేకము నిలచిపోవుట, సీతాలక్ష్మణులతో ఆయన అరణ్యానికి పోవుట, బంగారు లేడి వచ్చుట, దానిని సీతామ్మవారు కోరుట, అన్నీ బాగా వివరించిన తరువాత, 'రావణాసురుడు వచ్చి సీతాదేవిని అపహరించినాడు' అనే సరికి, తొట్టిలో పరుండి యుండిన పసిపాప, 'లక్ష్మణా! అంబెక్కడ' అని కేకలు వేసెను. అప్పుడు యశోద మాత్రము, 'ఏమిటి? ఈ పిల్లవాడు కలవరించెనే!' అని ఆశ్చర్యపడినది. మరొక దినము తానేతాను కల్పించుకొని, అన్న బలరామునిపై దూరు చెప్పినాడు, 'నన్ను నల్లనివాడని గేలిచేయుచున్నాడు' అని. 'అది నిజమే!' అని తల్లి చెప్పగా, 'సర్పులలో ఉన్న దోషముల నపహరించుట వల్ల నాకీ నల్లదనము' అని తన స్వభావ స్వరూపములను కొద్దిగా వివరించినాడు.

భూమిమీద భగవంతుడు అవతరించినప్పుడు ఆయన జీవితంలో లౌకికమూ, దివ్యమూ అనే రెండు అంతరాలుంటాయి. బాలకృష్ణుడు వెన్నపిడతలు పగల గొట్టినట్లు చెప్పగా విన్నారు. బృందావనంలో గోపికలు వెన్న తీసి పిడతలలో ఉంచితే కృష్ణుడు వాటిని బద్దలు కొట్టినట్లు స్థూలదృష్టికి తోచే అర్థము. వారి ఆత్మలచుట్టూవున్న భౌతిక ఆవరణలను కృష్ణుడు భగ్నం చేశాడు. అశాశ్వతమైన మమకారాలతో చిక్కుకున్నవాళ్ల చిత్తములకు విముక్తి కలిగించాడు.

తనకు చెందిన నవనీతమును అంటే వాళ్ల విశ్వాసమును కృష్ణుడు స్వాధీనం చేసుకున్నాడు. ఆత్మను పరిశుద్ధం చేసుకొనే సాధనమే చిత్తమును మధించటం. దానికి ఫలితంగా వచ్చినదే విశ్వాసమనే నవనీతం. 'ఇంటిలో పెట్టినవి తినవు. ఇంటింటికి పోయి దొంగిలించిన వెన్న నీకు రుచియగునే? ఎందుకు ఇట్లు నవనీతము అపహరించు చున్నావు?' అంటే, 'నా పనియే అది, నేను ఆ నవనీతము తినిన వారికి తృప్తి. వారు తరింతురు' అని జవాబిచ్చెను. దీని అంతరార్థము ఏమిటి? తన ఇంట్లో వెన్న లేకపోవటం వల్ల అట్లా చేశాడా? ఆయన మామూలు వెన్న ఆరగించలేదు. హృదయపు కుండలో దాచుకున్న సద్గుణముల నవనీతమే ఆయన ఆరగించేది. బాగా చిలికిన తరువాత పైకి తీసిన ఆత్మ తత్వమే ఆ వెన్న. ఆయన చేసినది దొంగతనమా? ఆయన పేరు హరి కదా! అన్నింటినీ హరించేవాడు. తను కనబడకుండా అన్నీ చూడగలవాడు. హరి లోపల చొరబడగానే నిద్రించే చైతన్యం మేలుకొంటుంది. హృదయంలో నాటుకున్న ధైర్యమును, అనుభవంతో నేర్చుకున్న వివేకమునూ పరమాత్ముడైన హరికి సమర్పణ చేయండి. అన్నింటినీ తనవిగా చేసుకోగల దొంగ ఆయన. బాలకృష్ణుడు దాగియున్న తావులను యశోద గుర్తుపట్ట గలిగిందట. పెరుగుతో తడిసిన అడుగుల జాడలు నేలమీద పడగా వాటినిబట్టి ఆమె గుర్తించగలిగిందట. బాలకృష్ణుని నడుము చుట్టూ తాడు బిగించి తనవైపు లాగుకోదలచినప్పుడు యశోద కట్టజాలకపోయింది. ఆ త్రాడు అహంకారము. భగవంతుని అహంకారపు త్రాడుతో బంధించగలరా! ఎన్నిసార్లు కట్టటానికి తలపెట్టినప్పటికీ రెండు జానలు తక్కువైంది త్రాడు. ఆ రెండు జానలూ ధర్మనిష్ఠ, బ్రహ్మనిష్ఠ అనే రెండు సుగుణాలు. అది కూడా చేరినప్పుడే త్రాడు పొడవు సరిపోగలదు. ఒకానొక సమయంలో బలరాముడు కృష్ణుని దివ్యత్వాన్ని యశోదకు గుర్తింపచేయాలని ఒక యుక్తి పన్నాడు. 'అమ్మా! కృష్ణుడు మన్ను తిన్నాడు' అని చెప్పాడు. యశోద కృష్ణుని చేయి పట్టుకొని, 'కృష్ణా! మన యింట్లో వెన్న లేదా! కావలసిన పదార్థములు లేవా? ఎందుకు నీవు మన్ను తిన్నావు?' అని మందలించింది. అప్పుడు కృష్ణుడు తన దివ్యత్వాన్ని పరోక్షంగా ప్రకటిస్తూ తల్లితో అన్నాడు, 'అమ్మా! నీవు నన్నొక సామాన్య బాలునిగా చూస్తున్నావు. నేను బాలుణ్ణి కాను. చూడు నా నోరు' అని నోరు తెరిచాడు. ఆమెకు కృష్ణుని నోటిలో అన్ని లోకాలు కనిపించాయి.

కృష్ణునికి మూడవ సంవత్సరము ప్రారంభమైంది. ఒకనాడు ఒక ముసలమ్మ కొన్ని అడవి పండ్లను అమ్మటానికి తీసుకువచ్చింది. కృష్ణుడు ఆ పండ్లను చూచి, 'అవ్వా! ఈ పండ్లంటే నాకు చాలా ఇష్టము. వీటిని ఇస్తావా?' అని అడిగాడు. 'నాయనా! నేను ఇవ్వటానికే వచ్చాను. ఐతే వీటకి తగిన వెల యివ్వాలి' అన్నది. కృష్ణుడు ఏమీ తెలియని అమాయకుని వలె, 'వెల అంటే ఏమిటి?' అన్నాడు. 'నేను నీకు ఫలములనిస్తే , ప్రతిఫలమేమైనా నాకివ్వాలి' అన్నది ముసలమ్మ. కృష్ణుడు లోపలికి పోయి తన చిన్న చేతులతో ఇన్ని బియ్యము తీసుకొని వచ్చి ముసలమ్మ ఒడిలో వేశాడు. ఆమె తన్మయురాలైంది. వెంటనే కృష్ణుని చేతులనిండా పండ్లు పెట్టి తన యింటికి బయలుదేరింది. ఒక్కొక్క అడుగు వేస్తుంటే నెత్తిపైనున్న బుట్ట బరువు అధికమౌతూ వచ్చింది. ఇంటికి వెళ్ళి బుట్టను క్రిందపెట్టి చూచింది. కృష్ణుడు యిచ్చిన బియ్యపు గింజలు అనంతమైన రత్నాలుగా మారిపోయి వున్నాయి! ఆమెకు బుట్టనిండా రత్నాలు కనిపించాయి. 'ఆహా! ఇతనెవరో భగవంతునివలె వున్నాడు. లేనిచో ఈ బియ్యమంతా రత్నాలుగా మారటానికి వీలౌతుందా! నేనెంత అదృష్టవంతురాలను' అని తనలో తాను ఆనందించి పొరుగింటివారిని కూడా పిలచి చూపించింది.

ఒకనాడు కృష్ణుడు దొంగతనం చేస్తుంటే యశోదకు చూపించాలని గోపికలందరూ చక్కని ప్లాను వేసుకున్నారు. 'చూడమ్మా! నీ కుమారుడు మా చెట్టు పైకెక్కి కాయలన్నీ కోసుకుంటున్నాడు'అని యశోదను పిల్చుకొని వచ్చారు. 'మీ మాటలు నాకు తెలుసు. నా కుమారుడు మా ఇంట్లోనే వున్నాడు' అని యశోద వారివెంట వెళ్ళటానికి నిరాకరిస్తూనే వెళ్ళింది. ఆమెకు కృష్ణుడు తన ఇంటిలోనూ కనిపించాడు, గోపిక ఇంటిలో కూడా కనిపించాడు! 'ఎందుకోసం చెట్టు ఎక్కావు?దొంగతనం కాదా యిది?' అని వారు కోపంతో చెట్టును ముట్టారు. అప్పుడు గోపికలకు నవ్వుగొలిపించే మాటలు మాట్లాడాడు కృష్ణుడు. 'నేను ఎందుకు చెట్టు ఎక్కాననుకుంటున్నారు మీరు? మా దూడలకోసం గడ్డి కోసుకోటానికి ఎక్కాను' అనడంతో గోపికలు గట్టిగా నవ్వారు. చెట్టుపైన గడ్డి వుంటుందా! ఈ నవ్వుతో కృష్ణునిపై వారికి గల కోపం

కూడా చల్లారిపోయింది. ఈవిధంగా ఇతరుల కోపమును, ద్వేషమును, అసూయను చక్కగా మాటలతో అణగ ద్రొక్కేవాడు కృష్ణుడు.

భగవంతుడు ఒక్క భక్తునికి మాత్రమే చిక్కుతాడు, వేరెవరికీ దొరకడు! చిత్తశుద్ధి కలిగి, నిర్మల ప్రేమతో వెతుకు వారికే చిక్కుతాడు.కృష్ణుడున్న వ్రేపల్లె ప్రాంతమునకే రాక్షసులనంతా పంపించాడు. ఈ రాక్షసులనందరిని బాలుడైన కృష్ణుడు హతమార్చాడు. ఏ రాక్షసుని మిగల్చ లేదు. ఒక రాక్షసి కంసుడు పంపటము చేత వచ్చి సుందరమైన స్త్రీగా తయారై, 'మీకు కుమారుడు పుట్టాడంట. చూడాలని, బిడ్డకు పాలు త్రాగించాలని చాలా ఆశగా ఉంది. ఇంత కాలమునకు నంద యశోదలకు కుమారుడు పుట్టాడంటే నాకు చాలా ఆశ్చర్యము వేసింది. ఒకతూరి నన్ను చూడనిస్తావా?' అన్నది. 'అమ్మా! బిడ్డను చూడటానికి అడ్డేమిటి? తప్పక లోపలకు వచ్చి చూడు' అంది యశోద. ఆమె ఎవరు? యశోదకు తెలిసిన మనిషిగానే వేషము వేసుకొని వచ్చింది. ఆమెయే పూతన. పాలివ్వటానికి పోయి ప్రాణము కోల్పోయింది. 'యద్భావం తద్భవతి' మనం ఎట్టి చింతన చేస్తామో అట్టి ఫలములే లభ్యమౌతుంటాయి. ఈ పుతన ఎవరు? ఈమె పుర్వజన్మలో బలిచక్రవర్తి కుమార్తె. ఈమె పేరు రత్నావళి. బలిచక్రవర్తి వద్దకు వామనుడు వచ్చినప్పుడు రత్నావళి కిటికీ నుండి చూచింది. 'ఈ బాలుడు ఎంత అందంగా ఉన్నాడు. ఇతడే నాకు పుట్టి ఉంటే అనేకవిధములుగా పాలించి పోషించి ఆనందించి ఉండే దానను' అని తనలో తాను అనుకొన్నది. అంతలోనే వామనుడు బలిచక్రవర్తి యిచ్చిన మాట ప్రకారం రెండడుగులు , ఒకటి భూలోకము, రెండవది ఆకాశము తీసుకొని, మూడవ అడుగు బలిచక్రవర్తి తలపై పెట్టాడు. వెంటనే రత్నావళికి కోపం వచ్చేసింది. 'ఎవడీ దుర్మార్గుడు? వీనిని చంపివేయాలి' అన్నది. మొదట వామనుని చూసినంతనే ప్రేమతో తల్లిగా పాలివ్వాలని ఆశించింది. కాని, కడపటికి చంపాలని సంకల్పించుకొన్నది. ఈ రెండు సంకల్పముల చేతనే ఆమె పూతనగా తిరిగి పుట్టింది. ఆ పూతనే కృష్ణునికి పాలివ్వాలని వచ్చింది. చంపాలని చూసింది. కడకు తానే చచ్చింది.

కృష్ణుడు ప్రతి నిత్యమూ గోపాలురతో అడవికి పోతూ వారితో ఆడుకొంటూ, పాడుకొంటూ కాలం గడుపుతూ వచ్చాడు. ప్రతి దినమూ ఏదో ఒక రాక్షసి వారికి అడ్డు తగలటం, కృష్ణుడు దాని ప్రాణాలు తీయటం. కృష్ణుడు పెద్ద రాక్షసుని చంపాడని గోపాలురు చెప్పినప్పుడు, 'ఓ భగవంతుడా! నా కుమారుని కాపాడినావా! నీకు పదివేల నమస్కారములు' అనేది యశోద.

ఒకనాడు పరుగెత్తి ఇంట్లో ప్రవేశించాడు. అమ్మ చీర పట్టుకున్నాడు, 'అమ్మా! ఈనాడు గోపాలురతో గోవులవెంట అడవులకు వెడతాను' అన్నాడు. అప్పుడు యశోద చెప్పింది, ' నాయనా! అడవులంటే సామాన్యముగా భావిస్తున్నావు. అక్కడ రాళ్ళు, రప్పలు, పురుగులు, తేళ్ళు, పాములు అన్నీ విషపురుగులతో కూడినదిగా వుంటుంది. కనుక, ఈనాడు నీకు చెప్పులు కుట్టించి రేపటి దినము నిన్ను గోవులతో పంపుతాను' అని అనింది. ఈనాటివలె చెప్పులు ఎక్కడంటే అక్కడ షాపుల్లో దొరికే కాలం కాదు ఆనాడు. ఆనాడు ఒక వ్యక్తిని పిలిపించి సరియైన సైజు చూపించి, కుట్టించటానికి ప్రయత్నించే కాలమది. యశోద ఈమాట చెప్పిన తక్షణమే కృష్ణుడు, 'అమ్మా! మన గోవులు చెప్పులు వేసుకొని అడవులకు పోవటము లేదే'. 'నాయనా! అవి పశువులు, నీవు మానవస్వరూపుడవు', అప్పుడు చెప్పాడు, ' అమ్మా! వాటిని పశువులుగా భావించవద్దు. తమ రక్తమును పాలుగా మార్చుకొని, తమ బిడ్డల గొంతులుకూడా కట్టుకొని ప్రజలకు క్షీరాన్ని అందిస్తుంది. పనికిమాలిన గడ్డిని తిని పాలిస్తున్నాయి మనకు. చచ్చిపోయనా, తన చర్మమును చెప్పులుగా కుట్టించుటకు ఉపయోగపడుతున్నాయి. దానికున్నటువంటి కృతజ్ఞత, అభిమానము, ప్రేమ మనిషికున్నవా? నేను ఒక్క దినము గోవులను చూడకపోయినా అవి కన్నీరు కారుస్తాయి. నేను ఎన్నో పర్యాయములు చూసాను, నా నోటి శబ్దము విన్నంతనే తోకలెత్తుకొని ఆనందంగా వింటూవుంటాయి. నావైపు చూస్తూ వుంటాయి. కేవలము పెద్ద గోవులే కాదు, చిన్న దూడలుకూడను పాలు తాగుతున్న సమయములో నా శబ్దము విన్నంత మాత్రమున పాలు త్రాగటము వదలిపెట్టి నావైపు చూస్తుంటాయి. గోవులకు, గోవత్సములకు ఉన్నటువంటి ప్రేమ నాపైన నీకు కూడా లేదమ్మా' అని అన్నాడు. గోవులకు నాయకుడు.

ఈవిధమైన ఆదర్శమును నిరూపిస్తూ పోవాలని ఆనాడు కృష్ణుడు ఈయొక్క భావములచేత యశోదయొక్క మనస్సులో మార్పు తెచ్చాడు.

దేవలోకంలో కూడా కృష్ణుని అనేకమంది అనేక రీతులుగా వర్ణిస్తూ వచ్చారు. ఈ వార్త బ్రహ్మ చెవిన పడింది. 'ఏమిటి? ఇంత చిన్న పిల్లవాడు! ఇన్ని మహత్తర కార్యములను సల్పుతున్నాడా!' అని ఆశ్చర్యపడి ఒకనాడు కృష్ణుని పరీక్షించటానికి ప్రయత్నించాడు. ఆనాడు కృష్ణుడు గోపాలురకు చెప్పాడు, 'ఈనాడు మీరు గోవులను తీసుకొని రావద్దు. దూడలను తీసుకొని అడవికి రావాలి. ఈనాడు మనం ఆటపాటలతోనే ఆనందముగా కాలము గడుపుదాం'. వెంటనే కొంతమంది మురళీలు తెచ్చారు. ఎక్కువమంది గోపాలురకు మరళి వాయించటం తెలుసు. ఇద్దరు పిల్లలు మాత్రం రెండు కుండలు తీసుకొని వచ్చారు. ఎందుచేత? వాటిని కడుపు దగ్గర పెట్టుకొని చక్కగా తాళం కొట్టవచ్చును. ఈనాడు దీనిని 'ఘటము' అంటున్నారు. ఇది ద్వాపర యుగంలోనే ప్రారంభమైంది. పిల్లలందరూ దూడలను తోలుకెళ్ళారు. యమునాతీరంలో కూర్చొన్నారు. కొంతమంది మురళి వాయిస్తున్నారు. కొంతమంది ఘటము కొడుతున్నారు. కృష్ణుడు డాన్సు చేస్తున్నాడు. కొంతదూరంలో పెద్ద తాడిచెట్లు కనిపించాయి. 'మాకు ఆకలిగా ఉంది కృష్ణా! ఆ ఫలములు కావాలి' అని గోపాలురు అడిగారు. ప్రక్కనే ఉన్న బలరాముడు, 'నేను తెస్తాను, ఉండండి' అంటూ పరుగెత్తుకొని వెళ్ళిఒక్కొక్క చెట్టును గట్టిగా ఊపాడు. ఫలములన్నీ రాలి క్రింద పడ్డాయి. బలరాముని శక్తికి చెట్లుకూడా విరిగిపోయాయి. ఆ చెట్లను బలరాముడు ఊపుతుంటే మాహా దీర్ఘదేహముతో ఒక గాడిద ప్రత్యక్షమైంది. అది క్షణక్షణమునకూ పెరుగుతూ వచ్చింది. ఆ గాడిదను చూచి గోపాలురందరూ భయభ్రాంతులకు గురియైనారు. బలరాముడు దాని రెండు కాళ్ళు పట్టుకొని భూమిపై కొట్టాడు. అది గుండె పగిలి చచ్చింది. అప్పుడు పిల్లలందరూ బలరాముని పట్టుకొని ఎగురుతూ ఆడుతున్నారు.

ఈసమయాన్ని పురస్కరించుకొని బ్రహ్మ అక్కడొక పెద్ద గుహను సృష్టించాడు. పిల్లలందరూ ఆటపాటలలో మునిగి మైమరచి ఉన్న సమయంలో దూడలన్నింటిని ఆ గుహలో ప్రవేశపెట్టాడు బ్రహ్మ. ఈవిషయం కృష్ణునికి మాత్రమే తెలుసు. తరువాతపిల్లలందరూ, 'కృష్ణా! దూడలెక్కడ?' అని అడుగగా, 'ఆ గుహ దగ్గరుంటాయి వెతకండి' అన్నాడు కృష్ణుడు. పిల్లలు గుహ దగ్గర చూసారు. లోనికి ప్రవేశించారు. వెంటనే గుహ మూసుకుపోయింది. ఒకటి రెండు దినములు కాదు, ఒక సంవత్సరము పాటు ఆ దూడలు, పిల్లలు గుహలోనే ఉండి పోవలసి వచ్చింది. అప్పుడు కృష్ణుడు ఎన్ని దూడలున్నాయో, ఎంతమంది గోపాలురున్నారో అందరి రూపములు తానే ధరించాడు! సాయంకాలమైనప్పుడు వారివారి యిండ్లకు వెళ్ళారు! తల్లదండ్రులందరూ వచ్చిన వారు తమ బిడ్డలే, తమ దూడలే అనుకొని చాలా ఆనందించారు. ఈవిధంగా సంవత్సరమంతా కృష్ణుడు తన లీలానాటకాన్ని జరుపుతూ వచ్చాడు. బ్రహ్మకు చాలా ఆశ్చర్యం వేసింది. చివరికి తన అపరాధమును క్షమించమని కృష్ణుని ప్రార్థించి గుహలో చిక్కిన గోపాలురను, దూడలను వారివారి యిండ్లకు పంపించాడు. కనుక, భగవంతుడు అనేక రూపములను ధరించవచ్చు. జగత్తంతా భగవంతుని స్వరూపమే! 'ఏకోహం బహుస్యాం' తన ఏకత్వమే అనేకత్వమును పొందియున్నది. ఇట్టి దైవత్వమును అందరూ గుర్తించటం అసాధ్యం.

గోకులంలో ఇంద్రుడు కుంభవర్షము కురిపించాడు. కురవటం సహజం. గోపికలు, గోపబాలురు అంతా కృష్ణుని చుట్టుకున్నారు. 'కృష్ణా! మమ్ములను రక్షించు. మా గోవులను రక్షించు. బాధలను సహించలేము. జీవించలేము' అని ప్రార్థించారు. అప్పుడు కృష్ణుడు చెప్పాడు, 'వర్షము నిలుపుటకు వీలుకాదు. అది నా సృష్టియే. కురవవలసిందే. అయితే దానిని తప్పించుకొనుటకు ప్రార్థన వల్ల కొన్ని ఉపాయములుంటున్నాయి. నాకు శక్తి ఉన్నదికదాయని దాన్ని నిలపటానికి వీలుకాదు. అప్పుడు నా శక్తిని నేనే ఉల్లంఘించినట్లవుతుంది. కనుక, నేను గోవర్ధన పర్వతమును ఎత్తుతాను. దాని క్రింద మీరు దాగి ఉండండి. వర్షమును నిలుపుటకు వీలుకాదు'. ఎత్తటానికి పోతే, మానవుని మంకు బుద్ధులు, తక్షణమే సందేహము ప్రారంభమైంది. కృష్ణా! రక్షించమని కోరినవారు, కృష్ణుడు గోవర్ధన పర్వతము ఒక్క చిటికిన వేలిపై ఎత్తేటప్పటికి, 'ఇంత పెద్ద పర్వతము మోయగలడా?' అని సందేహము వచ్చింది. అందులో వచ్చి చేరారు విశ్వసించినవారు. వర్షమునుంచి తప్పించుకున్నారు. కొండ ఎత్తటము ఎత్తాడు. సరిపోయింది. దాన్ని క్రిందకు దింపటము ఎట్లా? కొండ క్రింద దింపే

సమయంలో కొండ క్రింద మా కృష్ణుడు పడిపోతాడో యేమో. కృష్ణుడు, 'అందరూ నా ఆజ్ఞను శిరసావహించాలి. ఎవరు నా ఆజ్ఞ పాటిస్తారో వారు రక్షింపబడతారు. ఎవరు ఆజ్ఞ ఉల్లంఘిస్తారో వారు హతమైపోతారు. అందరూ ఒక్కతూరి నేను 'ఓం' అని పలికినప్పుడు అందరూ కన్నులు మూసుకోవాలి' అన్నాడు. కృష్ణుడు ప్రారంభించాడు. ఓం... అందరూ కన్నులు మూసుకున్నారు. కొండ క్రింద ఉంది. కృష్ణుడు వీరితో ఉన్నాడు. ఆ కొండను ఎలా క్రిందికి దింపాడు? ఇదియే భగవంతుని లీల. ఒక్క క్షణములో ఏమైనా చేయవచ్చు.

యధావిధిగా బలరామకృష్ణులు గోపాలురతో చేరి గోవులను తీసుకొని అరణ్యానికి వెళ్ళారు. కృష్ణుడు వేణువు ఊదుచుండగా గోపాలురు ఆటపాటలతో ఆనందంగా కాలమును, కాయమును మరచి వేణుగానములో లీనమయ్యారు. కొంతసేపటికి వారికి గోవులు, దూడలు జ్ఞాపకం వచ్చాయి. లేచి చూడగా గోవులు లేవు, దూడలు లేవు! గోపాలురు కంగారుపడి ఒక్కొక్కరు ఒక్కొక్క వైపుకు పరుగెత్తి చూసారు. కొంతదూరంలో గోవులు మేస్తున్నట్లుగను, వాటి చుట్టూఅగ్ని ప్రజ్వరిల్లుతున్నట్లుగను కనిపించింది. ఆ గోవుల చుట్టూ దట్టమైన పోగ క్రమ్ముకోసాగింది. ఇంక, ఈ గోపాలురు, 'కృష్ణా! కృష్ణా!' అని అరుస్తున్నారు. బలరామకృష్ణులు అక్కడికి పరుగెత్తారు. ఆలోపలనే అడవంతా అగ్ని ప్రజ్వరిల్లుతూ అందరినీ చుట్టుకుంది. ఏ క్షణంలో ఏమైపోతామోనని గోపాలురకు భయం వేసింది. కృష్ణుడు ఆయా గోవులను ఆయాపేర్లతో పిలుస్తూ గట్టిగా కేకలు వేశాడు. కృష్ణుని కంఠస్వరము వినగానే గోవులు కూడా అంబాయని అరచాయి. అవి ఎట్టి చదువులూ చదవలేదు. కాని, కృష్ణుని పిలుపు విని ఆప్యాయంగా, 'కృష్ణా!' అని పరుగెత్తుకొని వచ్చినట్లుగా రాసాగాయి. గోపాలురు మాత్రం ప్రాణభీతితో చింతిస్తున్నారు. అప్పుడు కృష్ణుడు, 'గోపాలులారా! మీరు భయపడనక్కరలేదు. నేనుండగా మీకెందుకు భయం? కన్నులు మూసుకోండి. తిరిగి నేను తెరువు మని చెప్పేంత వరకు ఎవ్వరూ తెరవ కూడదు' అన్నాడు. కృష్ణాజ్ఞను శిరసావహించి గోపాలురు కన్నులు మూసుకున్నారు. గోపాలురకు ఇది కొత్త కాదు. ఏనాడూ కృష్ణుని మాటలకు బదులు చెప్పినవారు కాదు. కృష్ణుడు వారని 'యిది చేయి' అంటే చేయటమే. 'ఫో' అంటే పోవటమే. అంతటి విశ్వాసం వారికి. తిరిగి కొన్ని నిముషములకు, 'కన్నులు తెరవండి' అన్నాడు కృష్ణుడు. చల్లని గాలులు వీస్తున్నాయి గోపాలురకు. ఆ మంటలు ఎక్కడ పోయాయో! గోవులన్నీ ఒక్కతూరి కృష్ణుని చుట్టూ చేరాయి. వారు అంతకు ముందు ఎక్కడైతే కృష్ణునితో ఆడుతూపాడుతూ ఉన్నారో, ఆ స్థానములోనే ఉన్నారు. ఆశ్చర్యంగా చూసారు. 'ఆపద్బాంధవా! ఆదిమధ్యాంత రహితా! శ్రీమన్నారాయణా!... ' అంటూ అందరూ కృష్ణుని పాదలపై పడ్డారు. ఎంతసేపు? కొంతసేపు మాత్రమే! తరువాత దీనిని మరచిపోయారు. భగవంతుడనే పదము పోయి, 'ఓ మిత్రమా!' అనే సంబోధన తిరిగి ప్రారంభమైంది. అద్భుతమును చూపినప్పుడు మహా శక్తివంతుడనుకుంటారు. మరుక్షణమే దేహాభిమానమును పురస్కరించుకొని, సామాన్య మానవుడని భావిస్తారు.

రెండవ దినము చాలా దూరం వెళ్ళారు. అది మంచి మధ్యాహ్న సమయం. గోపాలురకు బాగా ఆకలి వేసింది. 'కృష్ణా! మాకేమైనా ఆహారం కావాలి' అన్నారు. అప్పుడు కృష్ణుడు, "కొంత దూరంలోనే పండితులు యాగం చేస్తున్నారు. మీరు అక్కడికి వెళ్ళి, 'బలరామకృష్ణులతో వచ్చిన గోపాలురము మేము. మాకు ఆకలి వేస్తున్నది. దయచేసి అన్నం పెట్టండి' అని ప్రార్థించండి" అన్నాడు. ఈ గోపాలురు పండితుల వద్దకు వెళ్ళి కృష్ణుడు చెప్పినట్లుగా చెప్పారు. 'పూర్ణాహుతి కాక పూర్వమే మీకు భోజనము పెట్టటానికి వీలుకాదు' అన్నారు పండితులు. అంతవరకు కాచుకొనే ఓపిక లేదు గోపాలురకు. వారు కృష్ణుని వద్దకు తిరిగి వచ్చి జరిగిన సంగతి విన్నవించారు. 'గోపాలులారా! ఆకలి సంగతి అమ్మలకు తెలుస్తుందిగాని అయ్యలకేమి తెలుసు? వారు కేవలం మంత్రాలను, వాటి అర్థాలను విచారిస్తున్నారేగాని, మంత్రస్వరూపుడైన దివ్యత్వాన్ని గుర్తించటానికి ప్రయత్నించటం లేదు. భక్తిప్రపత్తులు అమ్మలయందే ఉన్నాయి. కనుక, వెనుక మార్గమున వెళ్ళి అమ్మలను అడగండి' అన్నాడు. గోపాలురు శ్రీకృష్ణుడు చెప్పినట్లుగా వంటశాలకు వెళ్ళారు. అక్కడ పండిత పత్నులు వంటలు చేస్తున్నారు. వీరు ఎంతోకాలంనుండి బలరామకృష్ణుల పేర్లు వింటున్నారేగాని చూడలేదు. ఆ గొల్లపిల్లలను చూడటం యేమిటని ఈ పండితులు వీరిని పంపించేవారు కాదు. ఈ గోపాలురు వెళ్ళి, 'బలరామకృష్ణులు పంపగా వచ్చిన వారము'

అని చెప్పటంతో ఆ స్త్రీలు పరుగెత్తి వచ్చారు. 'ఎక్కడున్నారు బలరామకృష్ణులు?' అని అడిగారు. 'అమ్మా! వారు ఆకలిచేత బాధ పడుతున్నారు. మమ్ములను వెళ్ళి అన్నము అడగమన్నారు. మాకు కూడా ఆకలిగా ఉన్నది' అన్నారు. వెంటనే ఆ స్త్రీలు వండిన వంటలను పాత్రలలో నింపుకొని, తమ భర్తలు యేమైనా అంటారేమో అనే భయమే లేకుండా బలరామకృష్ణుల దగ్గరకు వచ్చారు. ఆ సమయంలో కృష్ణుడు పడుకొని పిల్లనగ్రోవి ఊదుతున్నాడు. ఆ మధురమైన స్వరంలో వీరి హృదయాలు లీనమైనాయి. బలరామ కృష్ణులను చూసి దేహాన్ని మరచారు. 'కృష్ణా! కృష్ణా!' అన్న మాటే తప్ప వారి నోటినుండి మరొక పదమే రాలేదు. కృష్ణుని, గోపాలురను కూర్చోబెట్టి ఆకులు వేసి వడ్డించారు. అక్కడ పండితులకు కూడా ఆకలి వేసింది. వంటశాలలో తమ పత్నులనుగాని, వండిన పదార్థములుగాని కనిపించక పోవటంతో వారిని వెతుక్కుంటూ వచ్చారు. ఇక్కడకు వచ్చి చూసేటప్పటికి బలరామకృష్ణులు, గోపాలురు చక్కగా భోజనం చేస్తున్నారు. పట్టలేని కోపంతో తమ పత్నులను తిట్టటం ప్రారంభించారు. కాని, తమ పతులు వచ్చారనే విషయాన్ని కూడా వీరు గమనించ లేదు. అంత ఆనందంలో మునిగిపోయి ఉన్నారు. బలరామకృష్ణులను చూసేటప్పటికి వారి తేజస్సు ఈ పండితులపై పడింది. తక్షణమే పండితులు వచ్చి బలరామకృష్ణుల పాదాలపై పడ్డారు. 'ఎవరి నిమిత్తమై మేము యజ్ఞం చేస్తున్నామో ఆ ఫలస్వరూపమే నీవు. నీవు విష్ణుడవు' అని అనేకవిధములుగా స్తుతించారు. అప్పుడు కృష్ణుడు శ్రీమన్నారాయణునిగా వారికి దర్శనమిచ్చాడు.

మాధవుని చరిత్రములో ఘనమైన ఘట్టము కాళియ మర్దనమే. తాను పరమాత్ముడే, నరాకారముతో విచ్చేసిన నిరాకారమే అని చాటినాడు. ఏదో పెనుగాలి వచ్చినది, పిల్లవానిని ఎత్తుకొనిపోయి పడవేసినది, ఏమీ కాలేదు. పాము కరచినది, గోవు దూకినది, బండి దేహముపై పడినది, ఏమీ కాలేదు. ఇవన్నీ వ్రేపల్లెలో సహజమే! సామాన్యమే! అయితే కాళింగి మడుగులో దుమికి, దానిని పైకి లేవనెత్తి పడగలపై నాట్యమాడిన దృశ్యమును చూచి, 'ఈ బాలుడు నరుడు కాదురా, సాక్షాత్ నారాయణుడురా!' అని అందరికీ తేటతెల్లముగా ధృఢమైనది. కాళింగ మర్దనమంటే దానికి మంచి గూడార్థముకూడా కలదు. మానస సరోవరమే ఆ మడుగు. దానిలో విషయవాసన అనే విషసర్పము కాళింగుడు నివసించి, మనోవాక్కాయ కర్మలనన్నింటిని విషపూరితముగా చేయుచున్నది. భగవదనుగ్రహము వల్ల, దానిని అడుగునుండి పైకి లేపి, వివేకవైరాగ్యములతో దాని శిరములను త్రొక్కి నాట్యమాడిన, ఆ సర్పమునుండి ఏ బాధయు సంభవించదు. ముఖ్యముగా విషయాలకు లొంగకూడదు. పాదాల క్రింద పెట్టుకొని ఆ వాసనలను త్రొక్కివేయాలి. కృష్ణావతారములో జరిగిన ఒక్కొక్క సంఘటనకూ లౌకిక స్వభావముకాక, దానికి లౌకిక అర్థము పొందిక యుండదు. అలౌకికమైన ఆధ్యాత్మిక బోధ ఒక్కొక్క కథలోనూ యిమిడి యున్నది.

ఒకానొక సమయంలో బృందావనంలో గోపికలు, గోపాలురు కృష్ణుని చుట్టూ చేరినారు. అందులోను ఈ గోపికలు పిచ్చివారు. ఏ పిచ్చి? భగవంతుని పిచ్చి. కాని, పండితులు దీనిని అర్థం చేసుకోలేక అసభ్యకరమైన, అమర్యాదకరమైన విషయాలు ప్రబోధిస్తూ వస్తున్నారు. గోపికల ఆటపాటలయందు ఆధ్యాత్మిక తత్త్వమే యిమిడియుంటున్నది. కించిత్తైనా లౌకికము వారిలో కనిపించదు. ఒక గోపిక అన్నది, 'కృష్ణా! నీ వేణుగానమును మేము వినాలి. నీ వేణుగానములోని నాదమే మాకు ప్రాణము. అదే మా జీవితము'

పాట పడుమా కృష్ణా! పలుకు తేనెలొలుకునటుల
మాటలాడుమా ముకుంద మనసు తీరగా....
వేదసారమంత తీసి నాదరూపముగను మార్చి
వేణువందు తిరుగబోసి గానరూపముగను మార్చి ।పాట।

ఇందులో యేవిధమైన లౌకిక భావము లేదు. 'ఎన్నో వేదములున్నవి. స్త్రీలమైన మేము ఎన్ని చదువగలం? ఈ వేదములు మాకేమీ తెలియవు. వాటి సారమంతా సూక్ష్మంగా మా కందించు. బ్రహ్మ నాదస్వరూపుడు. కనుక, వేదసారమంతా తీసి నాదబ్రహ్మముగా మార్చి వేణువునందు తిరుగబోసి మాకు అందించు' అన్నారు. ఎంతటి దివ్యభావములు చేరాయి ఆ గోపికలలో!

కంసుని ఆజ్ఞపై అక్రూరుడు ఒక దినము రథము తీసుకొని బృందావనములో ప్రవేశించాడు. అక్రూరుడు మహా భక్తుడు. ఎట్టి ఆజ్ఞ అయినా సరే, దైవాన్ని చేరే మార్గము కల్పించాడు కంసుడు. 'కృష్ణా! కంసుడు ఒక యాగము ప్రారంభిస్తున్నాడు. ధనుర్ యాగమని పేరు. ఆ యాగము నిమిత్తమై మిమ్ములను తీసుకురమ్మని పంపాడు. కానీ, ఉన్న సత్యము భగవంతుని ముందు విన్నవించటము నా యొక్క ధర్మము. ధనుర్యాగమనే పేరుతో మిమ్ములను మధురకు రప్పించుకొని అక్కడ యేరీతిగానైనా హతమార్చి కంసుడు చిరస్థాయిగా జీవించాలని సంకల్పించుకున్నాడు. ఎవరి తలంపు వారిదే. ఎవరి సంకల్పము వారిదే. ఎవరు ఏవిధముగా తలంతురో ఆ విధముగా నీవు ఉంటావు. మానవుడంటే మానవుడుగానే నిరూపింప చేస్తావు. దైవమనుకుంటే దైవముగానే కనిపిస్తావు. భేదము నీయందు కాదు ఉండేది. సంకల్పించుకునే వారి సంకల్పములందుంటున్నాయి ఈ వ్యత్యాసములు. కనుక, కృష్ణా! నీవు సిద్ధము కావాలి' అన్నాడు అక్రూరుడు. అంతేకాక ప్రక్కనే ఉన్న నందుని ఆహ్వానించాడు. 'ధనుర్యాగమునకు సామంతరాజులు వేంచేస్తున్నారు. మిమ్మల్నీ రమ్మని కబురు పంపించాడు కంసుడు' అని చెప్పాడు.

మధురలో ఉన్నవారందరికీ బలరామకృష్ణులు వచ్చారని తెలిసిపోయింది. ఆ రూపము చూచినవారు తన్మయులై పోతున్నారు. చూచిన కన్నులు మూతవేయలేదు. ఆ రూపాన్నే చూస్తూ వచ్చారు. వారు ద్వారం దగ్గర ప్రవేశించారు. అక్కడ మదగజము కాచుకొని ఉంటున్నది. అందరూ ఆ నిముషమునకై ఆతృతతో చూస్తున్నారు. ఏ క్షణములో బలరామకృష్ణులను ఆ మదగజము హతమారుస్తుందో అనే చూస్తున్నారు. అది మహా ఉగ్రమై అనేక రకముల శబ్దములు చేస్తూ వచ్చింది. తన విశాల పాదములను పైకెత్తి వారిని తొక్కాలని ప్రయత్నిస్తున్నది. చిన్న కృష్ణుడు, చిన్న బలరాముడు. బలరాముడు ఒక కాలు, కృష్ణుడు ఒక కాలు పట్టుకున్నారు. ఏనుగును గట్టిగా తిప్పేశారు. చాకలి గుడ్డలు ఉతికినట్లుగా ఉతికారు. అరుచుకుంటూ రక్తము కక్కుకుంటూ ప్రాణము విడిచింది. మదగజము మరణించిందనే వార్త కంసునికి తెలిసింది. అతడికి భయము అధికమవుతూ వచ్చింది. ముష్టిక, చాణూరులున్నారు ముష్టియుద్ధమునకు. ఇద్దరూ వెళ్ళారు. వారు సిద్ధముగా ఉన్నారు. వీరు నవ్వారు. 'వీరా మాతో పోట్లాడేవారు? పిచ్చివారా! ఏనుగు ముందు దోమల వలె ఉన్నారు'. వారిపై చాలా కోపం వచ్చింది. వారిరువురిని బలరామకృష్ణులు ఒక్క పిడికిటిచేతనే హతమార్చారు. సాక్షాత్ పరమేశ్వరుడని వారిద్దరూ ప్రాణం విడిచే సమయంలో గుర్తించారు. తరువాత యాగశాలకు వెళ్ళారు బలరామకృష్ణులు. ధనుర్యాగము జరుగుతున్నది. అనేకమంది రాజులు, సామంతరాజులు చేరినారు. ఒక పెద్ద వేదిక చూపించారు. ఆ వేదిక పైన కంసుడు కూర్చున్నాడు. మధ్యలో ద్వారమునుండి బలరామకృష్ణులు నడుస్తూ వెళ్ళారు. పైకి గంభీరముగా కనిపిస్తున్నాడు కాని, కంసుని లోపల గుండె చాలా బలహీనమైపోతున్నది. ఒళ్ళంతా వణికిపోతున్నది. అనేకమంది అనుకున్నారు, 'ఈ బలరామకృష్ణులను చూడటం చేత క్రోధముతో వణుకుతున్నాడ'ని. క్రోధము చేత కాదు వణికేది, భయము చేత. తన దుష్టత్వమే ఆ భావము కలిగిస్తూ వచ్చింది. బలరామకృష్ణులు తన దగ్గరకు రాకుండా ముందుగానే అనేకమంది సిపాయిలను బందోబస్తు యేర్పరచుకున్నాడు. కంసుని లెక్కచేయలేదు బలరామకృష్ణులు. నేరుగా ధనుస్సు దగ్గరకు వెళ్ళారు. అది ఎవరు ఎత్తటానికి వీలు కానిది. ఎడమ చేతితో ఎత్తాడు. నారిని కట్టటానికి వంగతీస్తే విరిగిపోయి గొప్ప శబ్దము వచ్చింది. ఆ శబ్దమునకు అక్కడకు వచ్చిన వారందరూ భయభ్రాంతులైపోయారు. అదే సమయమునకు నందుడు కంసునికి కప్పము చెల్లించే నిమిత్తమై తట్టలో అనేకరకముల బహుమతులు తీసుకొచ్చి అందిస్తున్నాడు. నందుడు బలరామకృష్ణులను చూస్తున్నాడు. కానీ బలరామకృష్ణులకు ఎట్టి ప్రమాదము ఉండదని ధైర్యముతో ఉన్నాడు. ఆ ధనుస్సును భంగము చేసిన తక్షణమే కంసుడు లేచాడు. కంసుడు లేచేటప్పటికి తన పరివారమంతా లేచింది. బలరామకృష్ణులపై దూకాలని అనేకవిధములుగా ప్రయత్నము చేశాడు. మహా భారీ శరీరము కలవాడు కంసుడు. కానీ, క్రిదనుండి జింకపిల్లలవలె బలరామకృష్ణులు కంసునిపైకెగసారు. తల పట్టుకు క్రిందకు లాగి ఎన్ని రకములైన హింసలు చేయాలో అన్ని రకములైన హింసలు చేశారు. ప్రాణం విడిచాడు. కొన్ని క్షణాల్లో జరిగిపోయాయి. జనులు చాలా ఆశ్చర్య పడ్డారు.

కంస సంహారము జరిగిన తర్వాత దేవకీవసుదేవులు బలరామకృష్ణుల విద్యాభ్యాసమునకై ఏర్పాట్లు గావించారు.

అంతవరకు వారికి అక్షరాభ్యాసము కాలేదు. కారణమేమిటి? కంసుని వలన భయముచేత. ఏ పాఠశాలకు పంపినా ఆ కంసుడు తన దూతలను పంపి పిల్లల జీవితము నాశనము కలిగించుననే భయము చేత నందయశోదలు యేమాత్రము ప్రయత్నించలేదు. విద్య నిమిత్తమై ఆనాటి రాజులు, చక్రవర్తులతోబాటు సామాన్య మానవులుకూడా తమ యింటిని వదలి గురుకుల ఆశ్రమము లోపల జీవనం గడపాలనే నియమం ఉండేది. బలరామకృష్ణు లిలువురినీ సాందీపని దగ్గరకు పంపి విద్యాభ్యాసము ప్రారంభించారు. మధురకాదు, బృందావనము కాదు, వ్రేపల్లె కాదు. కాశీక్షేత్రమందు సాందీపని ఇంటియందు యిరువురినీ విద్య నభ్యసించుటకు వదలి వారు నిర్భయముగా జీవిస్తున్నారు. ఆనాటి విద్యార్థులు భుజబలము, బుద్ధిబలము అన్ని బలములు ఉండినప్పటికీ గురువాజ్ఞను శిరసా వహించి తాము విద్య నభ్యసించుటకు తగిన కృషి చేసేవారు. లేత వయస్సునందే అనేకమంది రాక్షసులను సంహరించి గొప్ప పేరు పొందిన బలరామకృష్ణులు సాందీపని యింటిలో యింటిపని చేస్తూ, గురువు ఆజ్ఞను శిరసావహిస్తూ వచ్చారు. గురుపత్నికి వంటకై వంటచెరకును అడవులకు వెళ్ళి తెచ్చేవారు. గురుకులమునందు అట్టి వినయవిధేయతలు పాటించటం చేత గొప్ప ఆదర్శవంతమైన విద్యార్థులుగా రూపొందుతూ వచ్చారు. ఆ సాందీపనికి ఒక్కడే కుమారుడు. కానీ, అతను చిన్న వయస్సునందే మరణించాడు. ఆ సతీపతులు ఇరువురూ పుత్రవ్యామోహము చేత, పుత్ర వియోగమును భరించుకొనలేక చాలా దుఃఖిస్తూ ఉండేవారు. చదువు ముగిసిన తరువాత బలరామకృష్ణులు సాందీపనికు నమస్కరించి, 'గురువర్యా మేము గురుకులము విడిచిపెట్టవలసిన సమయము దగ్గరపడుతూంది. మేము గృహమునకు వెడతాము. కొన్ని దినములనుండి మీరు ఏదో బాధతో కంటినీరు కార్చటం గమనిస్తుండినాము. మీరెందుకు బాధపడుతున్నారు? మేము మీ శిష్యులము. మీ బాధ నివారణ చేయవలసిన బాధ్యత మా మీద వుంది. దయచేసి చెప్పండి' అని ప్రాధేయపడ్డారు. 'నాయనా! మీబోటి శిష్యులకు నేను గురువు కావటము నా అదృష్టము. మీ శక్తి సామర్థ్యములు బయటి ప్రపంచమునకు వెల్లడి అయినవి. అలాంటి వీరులు, ధీరులు, గంభీరులు అయిన మీకు గురువు అగుట నా ప్రాప్తి. గురుకులములో ఉండినంత వరకు ఏవిధమైన విమర్శలకు అవకాశము లేకుండా చక్కగా ప్రవర్తిస్తూ వచ్చారు. నా దుఃఖం మీతో కాక ఇంకెవ్వరితో చెప్పగలను. నాకు వివాహమైన తరువాత ఎంతో కాలమునకు ఒక కుమారుడు పుట్టాడు. ఎంతో ప్రేమతో పెంచుతూ విద్యాబుద్ధులు నేర్పుతూ వచ్చాను. ఒకనాడు నా కుమారుడు సాగర సంగమమైన ప్రభాస తీర్థములో స్నానము చేయుటకు తోటి బాలురతో వెళ్ళాడు. సముద్రంలో కొట్టుకుపోయాడు. ఆనాటినుండి నాకీ పుత్రశోకము తప్పలేదు. కానీ, మీరిద్దరు నా వద్దకు వచ్చినప్పటినుండి మీలో నా కుమారుని చూచుకుంటూ కొంత ఊరటచెందాను. మరిప్పుడు మీరుకూడా ఆశ్రమాన్ని విడిచి వెడితే నేనిక ఏవిధంగా ఊరట చెందగలను' అని కన్నీరు కార్చాడు. కృష్ణుడు వెంటనే,' గురువర్యా! మేమిప్పుడే బయలుదేరి సముద్రునితో పోరాడి, మీ కుమారుని మీకు తెచ్చి అప్పగిస్తాము. మమ్ములను ఆశీర్వదించండి' అన్నాడు. బలరామకృష్ణులు అస్త్రశస్త్రములతో ప్రభాసతీర్థం చేరుకున్నారు. సముద్రపు తీరమున నిలబడి, 'సాగరా! మా గురువుగారైన సాందీపని కుమారుని తెచ్చి మాకప్పగించు. అట్లు చేయకపోతే నీవు శిక్షింపబడుతావు' అని గర్జించాడు కృష్ణుడు. సముద్రుడు పైకి వచ్చి వారిద్దరికీ నమస్కరించి, 'సాందీపని కుమారుడు సముద్రంలో పడటం వాస్తవమే! కానీ, అతనిని పాంచజన్యుడనే రాక్షసుడు ఎత్తుకుపోయాడు' అని చెప్పాడు. వెంటనే బలరామకృష్ణులు సముద్రగర్భమున ఆ రాక్షసుని కొరకు వెదకి అతనిని పట్టుకొని యుద్ధము చేశారు. పాంచజన్యుని చంపారు. కానీ, సాందీపని కుమారుడెక్కడా కనిపించలేదు. పాంచజన్యుని కడుపులో ఒక శంఖము వుండటము చూచి దానిని తీసుకొని యమపురికి వెళ్ళారు. శంఖమును పూరించాడు కృష్ణుడు. పిడుగువంటి ఆ ధ్వనిని విని యమధర్మరాజు ద్వారమువద్దకు వచ్చి బలరామకృష్ణులకు నమస్కరించి వారి రాకకు కారణమడిగాడు. 'యమధర్మరాజా! మా గురువుగారైన సాందీపని కుమారుని మాకు అప్పజెప్పు' అన్నాడు కృష్ణుడు. వెంటనే యమధర్మరాజు సాందీపని పుత్రుని వారికప్పగించాడు. గురుపుత్రుని వెంటబెట్టుకొని సాందీపని ఆశ్రమమును చేరారు బలరామకృష్ణులు. ఆ బాలుని గురువుగారికి అప్పజెప్పు, 'గురువర్యా! తల్లిదండ్రులవలె మమ్ములను సంరక్షిస్తూ, మాకు సకల విద్యలూ నేర్పారు. ఇదే మా గురుదక్షిణగా స్వీకరించండి. మమ్ములను దీవించండి' అన్నారు. సాందీపని,

అతని సతి తమ కుమారుని చూచి ఎంతో ఆనందపడ్డారు. బలరామకృష్ణులవంటి శిష్యులకు గురువైనందుకు చాలా ఉప్పొంగిపోయాడు.

లేత వయస్సులో మధురకు వెళ్ళిన కృష్ణుడు బృందావనమునకు తిరిగి రాలేదు. అటువంటివాడు గోపికలతో విహరించాడనటంలో యేమైనా అర్థముందా? గోపికలు అతని రాకకోసమే జీవితమంతా కాచుకొని కూర్చున్నారు. వీరి వేదనను, వీరి బాధను గ్రహించిన కృష్ణుడు ఒకానొక సమయంలో ఉద్ధవునితో ఒక సందేశము పంపించాడు. గోపికలందరూ ఉద్ధవుని చుట్టూ గుమిగూడారు. 'అమ్మా! ఇదిగో! కృష్ణుడు ఈ లేఖను పంపించాడు. మీలో ఎవరైనా చదువు తెలిసినవారుంటే చదివి వినిపించండి' అన్నాడు. ఆనాటి కాలంలో ఆడవారిని చదువుకోటానికి పంపించేవారు కాదు. ఏ ఒక్కరికో ఇద్దరికో తప్ప గోపికలకు చదువు రాదు. వారి భావములు ఎంత పవిత్రమైనవో, వారు ఎంత ఆవేదన అనుభవించారో దీనివల్ల మీకు అర్థమౌతుంది. ఒక గోపిక, 'ఉద్ధవా! ఆ లేఖను నేను ముట్టలేను. కృష్ణుని యెడబాటుతో నా హృదయమంతా వేడెక్కి పోయింది. ఇప్పుడా లేఖను ముట్టుకుంటే, అది కాలిపోతుందో యేమో!' అన్నది. మరొక గోపిక, 'కృష్ణుని ఎడబాటు చేత మా కన్నీటి ధారలు కాలువలై ప్రవహిస్తున్నాయి. ఒక్క అక్షరాన్ని చూసినా దుఃఖాన్ని పట్టలేము. మా కంటినీరు ఆ జాబుపై పడి అక్షరాలు చెరిగిపోతాయేమో!' అన్నది. ఇంతటి భక్తిప్రపత్తులతో ఉన్నారు గోపికలు. కట్టకడపటికి ఉద్ధవుడే చదివి వినిపించాడు. 'మీరు బాధ పడకూడదు. ఎప్పుడూ నేను మీ యింటనే, మీ వెంటనే, మీ జంటనే, మీ కంటనే ఉంటున్నాను. ఈ ఉద్ధవుడు భగవంతుని పొందే యోగమును మీకు బోధిస్తాడు. అతని ఆదేశాలను ఆచరణలో పెట్టండి' అని ఉంది ఆ లేఖలో. కాని, గోపికలు, 'ఉద్ధవా! నీవు బోధించే యోగము మాకు అక్కరలేదు. కృష్ణసంయోగమే మాకు కావాలి. మాకున్నది ఒకే మనస్సు. పది మనస్సులు లేవు. ఆ ఒక్క మనస్సు కృష్ణునితో పాటు మధురకు వెళ్ళిపోయింది. ఇంక నీ మాటలు వినే స్థితిలో లేము' అన్నారు. గోపికల చిత్తములెంత పవిత్రమైనవో గుర్తించాడు ఉద్ధవుడు. అతడు తిరిగి వెనుకకు బయలుదేరాడు. అతని వెంబడి ఒక్కొక్క గోపిక ఒక్కొక్క సందేశాన్ని కృష్ణునికి పంపించింది. 'ఎండ బారిన నాదు జీవిత సుమమాల చిగురు పెట్టగ వేగ చేయమనుము' అన్నది. ఒక గోపిక, ' మబ్బు క్రమ్మిన నా మానస వీథిలో కృష్ణభానుని తేజము నింపమనుము' అన్నది. మరొక గోపిక, 'చెదరిపోయిన నా జీవిత సుమముల చెలువార కూర్చి ధరించమనుము' అన్నది. ఈ వాక్యములన్నీ ఎంత భక్తిప్రపత్తులతో కూడినవో విచారిస్తే ఏ పండితునికైనా అహంకారముగాని, స్వార్థభావములుగాని హృదయంలో చేరటానికి వీలు లేదు. గోపికలు సాక్షాత్తు ఋషులు. చిత్తశుద్ధి కలిగినవారు. ఈ సత్యాన్ని గుర్తించిన ఉద్ధవుడు కృష్ణుని దగ్గరకు వెళ్ళి చెపుతున్నాడు, ' నీవు వారి చిత్తములో హత్తుకుపోయావు. వారి హృదయం నుండి నిన్ను విడదీయుట ఎవరి తరమూ కాదు. గోపికలవంటి భక్తులను ఈ జగత్తులో నేనెక్కడా చూడలేదు. నాకు బుద్ధి నేర్పారు. కృష్ణా! నీ మానవాకారమునే మేము చూస్తున్నాముగాని, నీ దివ్యత్వాన్ని గుర్తించినవారు గోపికలు తప్ప మరొకరు లేరు' అన్నాడు.

కంసుని భార్యలైన అస్తి, ప్రాప్తి అనే ఇరువురూ జరాసంధుని కుమార్తెలు. జరాసంధుడు తన అల్లుని మరణముకు చింతించి, తన అల్లుని అన్యాయముగా హతమార్చిరనే ఉద్దేశ్యముతో, ద్వేషముతో అనేకమంది మిత్రులను చేర్చుకొని మధురాపురిపై దండెత్తి వచ్చాడు. ఒక పర్యాయము కాదు. పదిహేడు పర్యాయములు దండెత్తి వచ్చాడు. ఆ వార్త విని బలరామకృష్ణులిరువురు కలసి ఆలోచించి, 'తాము వచ్చిన కార్యము దుర్మార్గులను హతమార్చాలని, మంచిని పెంచాలి, చెడ్డను నిర్మూలము గావించాలి. కేవలము జరాసంధుని చంపిన మాత్రమున ఈ సిపాయిలు తగ్గరు. జరాసంధుని ముట్టకుండా సైన్యమును మాత్రము హతమార్చా'లని ఒక్కొక్క పర్యాయము వచ్చిన సైన్యమును హతమారుస్తూ వచ్చారు. ఆ విధంగా ఓడిపోవటం, పరుగెత్తటంతో జరాసంధుడు చాలా అవమానమునకు గురౌతూ వచ్చాడు. ఆ సమయంలో జరాసంధుని మిత్రులందరు ఒకచోట చేరిపోయారు. ఏ రాజుకు చూసినా బలరామకృష్ణులపై ద్వేషమే! అలాంటి రాజులు యాదవ కులము వారిని ఎక్కడ చూచితే అక్కడ బాధించటము మొదలుపెట్టారు. అప్పుడు కృష్ణుడు చింతించి యాదవులను ఏవిధమైన బాధలూ లేని ప్రదేశమునందుంచాలని సంకల్పించి విశ్వకర్మను రప్పించాడు. సముద్రములో ఒక పట్టణము

నిర్మించి అందులో యాదవులను చేర్చాలని సంకల్పించుకున్నాడు. విశ్వకర్మ సంకల్ప మాత్రముననే సర్వమూ చేకూర్చాడు. చుట్టూ సముద్రము, మధ్యలో ద్వారకా పట్టణమును నిర్మించాడు. రాత్రికి రాత్రే మధురాపుర వాసులను ఆ పట్టణములో ప్రవేశపెట్టాడు.ద్వారక మహా సుందర పట్టణము. ఆ పట్టణములో యాదవులు సుఖంగా ఉన్నారు.

రుక్మిణీ కల్యాణము ప్రకృతి పురుషుల కలయికను తెల్పు తత్త్వబోధ. ఆ కల్యాణము బ్రాహ్మణ మధ్యవర్తిత్వము, వివాహ విధివిధాయకమైన వేదప్రామాణ్యమునకు చిహ్నము. వధూవరుల యేకీభావము వేదమంత్రముల మూలముననే ధ్రుఢపడును. రుక్మిణి జీవుడు, కృష్ణుడు పరమాత్మ. జీవబ్రహ్మైక్యమే, రుక్మిణీకృష్ణ సంయోగము. రుక్మిణి సదాచారశీల, సనాతన ధర్మపరాయణ. ఆమె కృష్ణుని ప్రేమించి, ఆయనను వివాహమాడ నిశ్చయించుకొన్నది. అందుకామె అన్నయు, తండ్రియు వ్యతిరేకులైనారు. కారణమేమనగా అన్న అహంకారి, కృష్ణద్వేషి. తండ్రి అనాత్మజుడు, లౌకిక లాలసుడు. అందువలన ఆమె వారిననుసరింప నిష్టములేక, స్వతంత్రింప శక్తిలేక మనుసున బాధపడి, 'కృష్ణా! నాకు నీవు తప్ప వేరే శరణము లేదు. నన్ను నీ పాదదాసిని చేసికొను భారము నీదే'నని నిశ్చలమైన భక్తితో, నిరంతరము కృష్ణుని ప్రార్థించుచూ, ధ్యానించుచూ కాలము గడుపుచున్నది. ఆమె ప్రార్థన, పరితాపము కృష్ణుని మన్నన లందుకొన్నవి. ఆమె ప్రాచీన సాంప్రదాయానుష్టానమే యామె అభీష్టసిద్ధికి తోడ్పడినది. ఎట్లనగా, వివాహప్రక్రియకు ముందామె గౌరిని పూజించుటకు దేవాలయమునకు వెళ్ళినది. అది ప్రాచీన సాంప్రదాయము. పూజానంతరము, రుక్మిణి ఆలయమునుండి వెలుపలకు రాగానే ఆమె రాకకు యెదురుచూచుచు అక్కడనే వేచియున్న కృష్ణుడామెకు చేయూతనిచ్చి, రథముపై గూర్చుండపెట్టుకొని వెళ్ళిపోయినాడు. ఆమె అన్నయు, తండ్రి, బంధువులు కృష్ణునెదిరింప యత్నించిరిగాని లాభములేకపోయినది. రుక్మిణి బంధువర్గమును పరిత్యజించి తన మనోనాథునితోగూడి తరలిపోయినది. వివాహమునకు ముందామె కృష్ణు నెన్నడును చూడలేదు. పూయింగు ఆ కాలమున లేదు. అది భారతీయ సంప్రదాయము కాదు. రుక్మిణి యాత్మ కృష్ణునికొర కుత్కంఠతో తపించినది. కృతార్థమైనది. ముందు జరిగినది వారి ఆత్మల కలయిక. తరువాత దేహముల కలయిక. కాబట్టి, వారిది లోకసాధారణమైన వివాహము కాదు. సాహస కృత్యము కానేకాదు.

'న శ్రేయో నియమం వినా' నియమము లేని కార్యము శ్రేయస్సు నందించదు. లోకాన్ని నియమించటానికి యమము ప్రధానము. తనను తాను నియమించుకోటానికి నియమము ప్రధానము. లోకాన్ని పాలించేది యమతత్వము. తనను తాను నియమించుకొనేది సంయమము. ప్రేమకుగాని, ద్వేషమునకుగాని, లేదా అహంకారమునకుగాని, ఆనందమునకుగాని, ప్రతి విషయంలోను నియమం అవసరం. అట్టి నియమమును ఆదర్శవంతమైన రూపములో అందించిన వ్యక్తి శ్రీకృష్ణుడు.

పాండవులు అరణ్యవాసం చేస్తున్న సమయంలో ఒకనాడు కృష్ణుడు వారి యోగక్షేమాలను విచారించే నిమిత్తమై అరణ్యానికి వెళ్ళి ఒక రాత్రి అక్కడే ఉన్నాడు. రాత్రిపూట సెక్యూరిటీ నిమిత్తమై పాండవులు ఒక్కొక్కరు ఒక్కొక్క గంటసేపు పహారా చేస్తూ వచ్చారు. ఆ రాత్రి తనకు కూడా ఒక గంటసేపు పహారా చేయటానికి అవకాశమ్మివమని ధర్మజుని కోరాడు కృష్ణుడు. ధర్మజుడు అంగీకరించాడు. పాండవులు పహారా చేస్తున్న సమయంలో ఒక భూతం పెరిగి పెరిగి పెద్దదవుతూ వారికి కనిపించింది. కానీ, వారు దానినేమీ చేయలేకపోయారు. ఇంక కృష్ణుని వంతు వచ్చింది. అప్పుడు ధర్మజుడు, 'కృష్ణా! ఈ అడవిలో ఒక భూతమున్నది. అది మిమ్మల్నేమైనా బాధ పెడుతుందేమో! కనుక, మీరు వెళ్ళవద్దు' అన్నాడు. కృష్ణుడు, 'ధర్మజా! నేను దైవముననే సత్యాన్ని నీవు నిజంగా గుర్తిస్తే ఎందుకు నీకు సందేహం కలిగింది? ఇది నీ బలహీనత. ఆ భూతం నన్నేమీ చేయలేదు. దాని సంగతి నేను చూస్తాను' అన్నాడు. రాత్రి రెండు గంటల నుండి మూడు గంటల వరకు డ్యూటీ చేశాడు. మూడు గంటలకు అర్జునుడు డ్యూటీలో ప్రవేశించే సమయానికి కృష్ణుడు ఒక రాతిపైన కూర్చుని నవ్వుతూ కనిపించాడు. ఎక్కడా దయ్యం లేదు. భూతం లేదు. అర్జునుడు ఆశ్చర్యంతో, 'కృష్ణా! ఆ దయ్యాన్ని మీరేమైనా సంహరించారా?' అని అడిగాడు. కృష్ణుడు, 'అర్జునా! నేను దానిని సంహరించనక్కరలేదు. ఎందుకంటే అది దయ్యం కాదు, భూతం కాదు, పిశాచి కాదు. అది మీ మనోభావాల యొక్క ప్రతిబింబమే. మీ క్రోధమే మీకు దయ్యం

రూపంలో కనిపించింది. మీకు దానిపై క్రోధం అధికమయ్యేకొలది దాని స్వరూపం కూడా పెరిగిపోతూ వచ్చింది. నాకు మాత్రం దానిపై ద్వేషం లేదు, క్రోధం లేదు. అది కూడా నా అంశమే అన్న భావంతో నేను ఆనందిస్తూ ఉన్నాను. కనుకనే, అది కనిపించకుండా పోయింది' అన్నాడు. నిజానికి మనకెవ్వరూ శత్రువులు లేరు. ద్వేషులు లేరు. మన ద్వేషమే మనకొక పెద్ద దయ్యంగా కనిపిస్తుంది. మనలోనున్న దుర్గుణములే మన శత్రువులు. కనుక, మీలో ప్రేమను అభివృద్ధిగావించుకోండి. అప్పుడు మీ ముందు ప్రేమస్వరూపమే కనిపిస్తుంది. మనలోనున్న దుర్గుణములే మన శత్రువులు. ఎవరిపైనో కక్ష సాధించాలనుకుంటే మీలో ద్వేషం పెరుగుతూ వస్తుంది. దానివల్ల నష్టపోయేది ఎవరో కాదు, మీరే! ఈ సత్యాన్ని కృష్ణుడు పాండవులకు బోధించాడు. అప్పటినుండి పాండవులు తమలోని ద్వేషాన్ని సంహరించుకున్నారు. అందుచేతనే మహాభారత యుద్ధంలో విజయాన్ని సాదించగలిగారు.

కర్తవ్యమును గుర్తించుకోవటము కృష్ణుని ఆదర్శములలో ప్రధానమైనది. న్యాయమునకు ప్రాణత్యాగము చేయుటకైనా సంసిద్ధము కావటము రెండవ ప్రధాన లక్షణమని కృష్ణుడు బోధించాడు. ఇందులోని అంతరార్థమును, అర్జుననకు కృష్ణుడు తెలిపిన విషయాన్ని యోచించుట అవసరము. కృష్ణుడు రాయబారమునకు వెడుతున్న సమయములో అర్జునుడు కృష్ణుని ప్రయత్నానికి అంగీకరించలేదు. 'కృష్ణా! ఎందునిమిత్తము నీవు కౌరవులతో రాయబారము జరపాలి? కౌరవులు మంచి హృదయము కలవారు కారు. ఈ రాయబారము వలన ప్రయోజనము లేదు. ప్రయోజనము లేని దానికై నీవు యిన్ని రకములుగా శ్రమ తీసుకొని కాలము వ్యర్థము చేయుచున్నావు' అన్నాడు. అప్పుడు కృష్ణుడు, ' అర్జునా! అధర్మముచేత ధర్మము, అన్యాయముచేత న్యాయము చంపబడుతున్నటువంటి సమయములో ఏ మానవుడు చూస్తూ ఊరుకుంటాడో అట్టివాడు జీవచ్ఛవముతో సమానము. కనుక, ఇలాంటి అన్యాయము జరుగుతున్న సమయములో చూస్తూ ఊరుకోటము నాయొక్క ధర్మము కాదు' అన్నాడు. దానికి అర్జునుడు చెబుతున్నాడు, ' కృష్ణా! దుష్టబుద్ధులైన కౌరవులు అరమరలు లేక సంధికి వత్తురా! ఉత్తర దక్షిణ ధ్రువములు కలియునా! యుద్ధమునకు సిద్ధముగాక కాలహరణమేల గోపాలా?'. ఈ అర్జునుడు చెప్పిన మాటలు గమనించినప్పుడు కృష్ణుడు రాయబారములో ఇద్దరకూ సంధిచేసే నిమిత్తమై ఎంతవరకు ప్రయత్నము చేసినాడో అర్థమవుతుంది. రాయబారమునకు పూర్వము అర్జునుడు చెప్పిన మాటలు ఈవిధంగా ఉంటే తదుపరి యుద్ధసమయమందు, 'ఇందరి బంధుమిత్ర, గురుపుత్రుల జంపి భరించుటెట్టులో కృష్ణా! నా కన్నులు తిరుగుచున్నవిక కాలము గడుపక పదండి యింటికిన్' అన్నాడు. ఇక్కడ కృష్ణునికి విరుద్ధమైన భావము ఏర్పడినది. 'అర్జునా! ధీరుడుగా వచ్చి భీరువుగా మాట్లాడటము నీకు తగిన కర్తవ్యము కాదు. యుద్ధము అప్పటికప్పుడు సృష్టింపబడినది కాదు. ఒక నెలనుండి దీనికి సన్నాహములు జరుగుతున్నాయి. యుద్ధము చేయవలెనని బూజుపట్టిన అమ్ములను, చిలుము పట్టిన ఖడ్గమునుకూడ శుభ్రము చేసికొన్నావు. బంధువుల సహాయము కోరినావు. ఇన్ని చేసి యుద్ధము చేయనని చెప్పుటలో అంతరార్థము ఏమిటి? ఈ మాట ఇంతకు పూర్వము చెప్పియుండిన నేనింత శ్రమకు గురియై ఉండేవాడను కాదుకదా! ఇంతటి పిరికిపందవు నీముఖము చూడకూడదు. నీ కర్తవ్యాన్ని నిర్వర్తించకుండా నీవు వెళ్ళుతున్నావు. నీవు వెనుకకు పోవుటకు వీలుకాదు' అని కర్తవ్యమును నిర్వర్తించమని ప్రోత్సహించాడు. పూర్వం యుద్ధమే లేకుండా చేయాలనే ఉద్దేశ్యముతో రాయబారము చేసిన కృష్ణుడు ఇప్పుడు యుద్ధమునుండి వెనుకకు పోయే అర్జునుని మరలించి యుద్ధములో పాల్గొనేటట్లు చేయటములో అంతరార్థము ఏమిటి? ముందుగా సాధ్యమైనంత వరకు లోకమునకు కల్యాణము చేకూర్చాలని, లోకశాంతిని అందించాలని, ఎవరికీ ప్రాణనష్టము కలుగరాదని శ్రీకృష్ణుడు ప్రయత్నము చేసినాడు. ఇక్కడ న్యాయము నిమిత్తము, అధికారం నిమిత్తము, హక్కుల నిమిత్తము ప్రాకులాడి కర్తవ్యమును నిర్వర్తించుట శ్రీకృష్ణుని ఆదర్శము. సత్యమును నిరూపించుటకు శ్రీకృష్ణుని జీవితమే ఆధారము.

పాండవులు భగవంతుడే తమ సర్వస్వమని నమ్ముకొన్నారు. కౌరవులు భగవంతుని విస్మరించి రాజ్యమే తమ సర్వస్వమని విశ్వసించారు. ఈ మహాభారత యుద్ధమునకు ముందుగా దుర్యోధనుడు, అర్జునుడు ఇరువురూ కృష్ణుని సహాయాన్ని అర్థించటానికి వెళ్ళారు. కృష్ణుడు నటన సూత్రధారి. వీరిరువురూ వస్తున్నది చూసి, తాను ఏమీ ఎరుగనట్లుగా

కళ్ళు మూసుకొని పడుకొన్నాడు. దుర్యోధనునికి, అర్జునుడికి మధ్యగల వ్యత్యాసాన్ని లోకానికి చాటే నిమిత్తమై కృష్ణుడీవిధముగా నటించాడు. దుర్యోధనుడు అహంకారి. కృష్ణుని పాదాల చెంత కూర్చోవటము అవమానకరంగా భావించి, అతని తల దగ్గర కూర్చొన్నాడు. కాని, అర్జునుడు కృష్ణుని పాదములే తనకు శరణ్యమని విశ్వసించి అతని పాదముల చెంతనే కూర్చొన్నాడు.

కొంతసేపటికి కృష్ణుడు కళ్ళు తెరచి మొట్టమొదట తన పాదముల చెంత కూర్చొనియున్న అర్జునుని చూచి, 'అర్జునా! ఎందుకోసం వచ్చావు?' అని ప్రశ్నించాడు. లేచిన తక్షణమే కృష్ణుడు అర్జునుడినే పలకరిస్తున్నాడు కాని, తనను పలకరించటం లేదే అనే అసూయాహంకారాలు దుర్యోధనునిలో ప్రారంభమైనవి. వెంటనే అర్జునుడు లేచి నమస్కరించి, ' కృష్ణా! నీ సహాయాన్ని అర్థించటానికి వచ్చాను' అన్నాడు. దుర్యోధనుడు తన వెనుక కూర్చొని వున్నాడని కృష్ణునికి తెలుసు, కాని, అతనిని చూడలేదు. 'అర్జునా! నీకేమి కావాలి?' అని కృష్ణుడు మరల ప్రశ్నించాడు. మొట్టమొదట కోరినవన్నీ అర్జునునికే ఇస్తాడేమోనని అసూయతో దుర్యోధనుడు, 'కృష్ణా! నేనుకూడా నీ సహాయం కోసమే వచ్చాను' అంటూ కృష్ణుని ముందుకు వచ్చాడు. అప్పుడు కృష్ణుడు, 'నేను ఒక్కడినే మీ ఇద్దరిలో ఒకరివైపుకు వస్తాను. నా సైన్యాన్ని మరొకరికి ఇస్తాను. నీకు సైన్యము కావాలా లేక నేను కావాలా?' అని ప్రశ్నించాడు. కృష్ణుడు తప్ప తనకేమీ వద్దని అర్జునుడు కోరాడు. వెంటనే దుర్యోధనుడు కృష్ణుని సైన్యమంతా కావాలని అడిగాడు. అప్పుడు కృష్ణుడు సైన్యానంతా దుర్యోధనుడికిచ్చి పంపివేసి , అర్జునుని వీపు నిమిరి అతని అచంచల భక్తివిశ్వాసాలకు మెచ్చుకొన్నాడు.

కార్తీక బహుళ త్రయోదశినాడు ధర్మక్షేత్రమనే కురుక్షేత్రములో కౌరవ సేనలు 11 అక్షౌహిణులు తీరి ఉన్నాయి. ఈ సైన్యమునకు ముందు తెల్లని గుఱ్ఱములతో కూడిన తెల్లని రథమునందు తెల్లని వస్త్రములు ధరించి, తెల్లని తలపాగను ధరించి ఒక వృద్ధసింహము అక్కడ కూర్చొంది. ఈ వృద్ధసింహమే భీష్ముడు. రెండవవైపు 7 అక్షౌహిణుల సైన్యము బారులుగా నిలబడిన వారికి ఎదురుగా బలవంతుడైన భీష్ముడు సైన్యాధ్యక్షుడుగా నిలుచున్నాడు. మున్నూరు అశ్వమేధ యాగములు ఆచరించిన భీష్మాచార్యుడు కౌరవ సైన్యమునకు ముందు నిలుచునేసరికి పాండవులకు భయభ్రాంతులు కలిగినవి. ఒకవైపు యుద్ధపు వాద్యముల ధ్వనులు మిన్ను ముట్టుచున్నవి. అశ్వములు హేషలు, ఏనుగులు ఘీంకారములు చేయుచున్నవి. అన్ని రథములపైన ఉన్న రకరకములైన పతాకములు రెపరెపలాడుచున్నవి. ప్రతి ఒక్కరి హస్తమందున్న ఆయుధములు తళతళ మెరుస్తున్నాయి. ఈ స్థితిలో ఎక్కడనుంచో ఒక రథము వచ్చి అక్కడ మధ్యలో ఆగింది. అందులో ఒక వ్యక్తి అతిబలహీనుడై, దీనుడై ఉన్నట్లుగాను, మరొక వ్యక్తి అతనికి ధైర్యసాహసముల నందిస్తూ ఏదో ఒక ప్రబోధ సలుపుతూ వీపు నిమురుతునట్లుగాను కనిపించింది. వారే నరోత్తముడైన అర్జునుడు, అవతారమూర్తియైన కృష్ణుడు. అధికారియైన అర్జునుని స్థాయికి దిగి మానవునకు ఆదర్శమైన జీవితమును అవతారపురుషుడైన కృష్ణుడు అందించాడు. కొన్ని క్షణములు జరిగిన తరువాత కృష్ణుడు రథము దిగి ధర్మజుని రథమువైపు వేగంగా పోతున్నాడు. అక్కడ ఏమి చెప్పెనో ఏమో! తక్షణమే ధర్మజుడు కవచమును విప్పినాడు. పాదరక్షలను విప్పినాడు. కిరీటము క్రింద పెట్టినాడు. చేతులు ముకుళించుకొని కౌరవులవైపు నడచుకొని వెడుతున్నాడు. ఈ దృశ్యమును చూచిన కౌరవులు కేకలు వేసినారు. శరణాగతి పొందే నిమిత్తమై ధర్మజుడు వస్తున్నాడని వారు భావించారు. ఈ దృశ్యమును చూచిన అర్జునుడు, భీముడు భరించలేని బాధను అనుభవించారు. ధర్మజునియందున్న ఉత్తమ భావములోని అంతరార్థాన్ని అర్జునుడు, భీముడు గమనించలేక పోయారు. కృష్ణుడు భీమార్జుల దగ్గరకు వచ్చి, 'మీ అన్నను అనుసరించడ'ని చెప్పి సైగ చేసినాడు. వారు కృష్ణుని ఆజ్ఞను శిరసా వహించి అన్నను అనుసరించారు. ధర్మజుడు తన సోదరులతో కూడ భీష్ముని దగ్గరకు వెళ్ళినాడు. భీష్ముడు వారి రాకలోని అంతరార్థమును గ్రహించి, ధర్మజుని గుణగణములకు తనలోతాను ఆనందించాడు. ధర్మరాజు భీష్ముని కాళ్ళపైబడి, 'పితామహా! తమ యొక్క పోషణ చేతనే మేము ఈనాడు ఈస్థితిలో ఉన్నాము. తండ్రిని కోల్పోయిన బిడ్డలను చెంత చేర్చి, ఆదరించి, అన్నివిధాలా అభివృద్ధికి తెచ్చినావు. కాని, దురదృష్టవశాత్తు ఈనాడు మేము మీతో యుద్ధము చేయవలసిన అవసరము యేర్పడినది. ఈసమయమున మీతో యుద్ధము చేయుటకు తమ ఆజ్ఞను కోరుతున్నాము' అన్నాడు. భయంకరమైన యిటువంటి సమయమందు కూడ తన కర్తవ్యాన్ని, నియమమును ధర్మజుడు పాలించుట

భీష్ముని హృదయమును కరిగించినది. ధర్మజుని కౌగలించుకొని, 'నాయనా! నీకు విజయము చేకూరుగాక! ఈ భయంకర యుద్ధభూమియందు కూడ నీవు నియమాన్ని, ధర్మాన్ని పాటించావు. ధర్మమును రక్షించిన నిన్ను ధర్మమే రక్షిస్తుంది' అని ఆశీర్వదించాడు. తరువాత భీమార్జున నకుల సహదేవులు కూడ భీష్మునికి నమస్కరించి, ఆశీర్వాదం పొందారు. తరువాత గురువైన ద్రోణాచార్యుని దగ్గరకు వెళ్ళి, 'తమరు గురువులు. మేము శిష్యులము. దురదృష్టవశాత్తు గురుశిష్యుల మధ్య యుద్ధము యేర్పడింది. గురువులతో యుద్ధము చేయట మహాపాపము. ఈనాడు మీతో యుద్ధము చేయుటకు అనుజ్ఞను అనుగ్రహించండి' అని ప్రార్థించాడు ధర్మరాజు. ద్రోణుడు ధర్మజునితో, 'నీ ధర్మము వల్ల నీకు విజయము చేకూరుతుంది' అని అనేకవిధములుగా దీవించి ఆలింగనము చేసుకొన్నాడు. ఈవిధమైన నియమములు కృష్ణుడు ప్రబోధించుట జరిగినది. సర్వజ్ఞుడు, సర్వశక్తిమయుడు, సర్వవ్యాపకుడైన పరమాత్ముడు యిన్ని బాధలను అనుభవించ వలసిన అవసరమేమున్నది? తన కోసమా? కాదు, కాదు. ఇందులో తన స్వార్థమేమాత్రము లేదు. తనను ఆశ్రయించిన వారిని ఆదరించే నిమిత్తమై ఈరకమైన చర్యలకు పూనుకున్నాడు. భక్తులపైనున్న ప్రేమ వలన భగవంతుడు అనేకవిధములైన యిక్కట్లకు గురియై వారిని సంరక్షించే నిమిత్తము ఆదర్శవంతమైన జీవితాని నిరూపించినాడు.

శ్రీకృష్ణుడు గీతను బోధించేటప్పుడు అర్జునుని అనేక అనుమానాలు బాధించినాయి. మానవునికి ఎదురు తగులు బాధలకు, కష్టములకు, విచారములకు తట్టుకొని వెనుకంజ వేయక ధైర్యముతో ఎదుర్కొన గలుగుటకు కృష్ణుడు యోగమును బోధించినాడు. గీత జ్ఞాన, వైరాగ్య, మోక్ష, ఆధ్యాత్మిక మార్గములలో ఉన్నత స్థానాన్ని పొందే నిమిత్తమై అందించినదిగా భావిస్తున్నాము. కాదు, కాదు. గీతను నిత్య జీవితములో సామాన్య మానవునకు అన్ని రంగములలో తోడ్పడు ఆదర్శాన్ని అందించేదిగా నిరూపించవచ్చు. ఆధ్యాత్మికము, లౌకికము వేరు వేరు కాదనే సత్యాన్ని కృష్ణుడు నిరూపించాడు. నిత్యజీవితము ఆధ్యాత్మికముతో మిళితమైనదిగా భావించాడు. మానవుని మనస్సునకు, వాక్కునకు, క్రియకు సన్నిహితమైన సంబంధమును చేకూర్చినాడు. సంకల్పములకు మనస్సు ప్రధానమని, సంకల్పించిన దానిని వెలిబుచ్చటానికి వాక్కు ఆధారమని ఈ రెండింటిని క్రియారూపములో ఆచరించుటకు కర్మ అత్యవసరమని చాటినాడు. ఎట్టి కార్యమునకు పూనుకొనుటకైనా దైవమునకు అభ్యంతరముండదనీ, దైవము సంకల్పించినచో పాండవులకు ఎటువంటి చిక్కులూ, యుద్ధము లేకుండ చేయవచ్చు కదా అని అనేకులు పలుకవచ్చును. కృష్ణుడు తన దివ్యశక్తులను లోకములో ప్రకటించక మానవమాత్రుడుగా ఆదర్శవంతమైన జీవితాన్ని అందించాడు.

లోకారాధ్యుడైన గోపాలకృష్ణుడు అన్ని రంగములందు ఆదర్శవంతమైన జీవితాన్ని అందించిన మహావ్యక్తి. అతని యందున్న సద్గుణములయొక్క లక్షణాలను విచారించటానికి పూనుకునేముందు అతని మాధవత్వాన్ని కొంతవరకు ప్రక్కకు పెట్టి అతని మానవత్వాన్ని మాత్రమే విచారించటానికి, అనుసరించటానికి పూనుకోటము అత్యవసరము. నిజముగా కృష్ణుని యొక్క చరిత్రయందు మానవత్వమును అనేకులు గమనించరు. కానీ, యదార్థమునకు అతని మానవత్వములోని వినయవిధేయతలు కొట్టవచ్చినట్లుగా కనిపిస్తుంటాయి. ఒకానొక దినము యుద్ధము భయంకరముగా జరుగుతున్నది. కర్ణుడు తన అస్త్రశస్త్రములచేత పాండవుల సైన్యాన్ని చాలా ఘోరముగా తరిమి కొదుతున్నాడు. కర్ణుడు ప్రయోగించే అస్త్రములకు తాళలేక పాండవుల సైన్యము పరుగెత్తుచున్నది. అనేకమంది దాక్కుంటున్నారు. కొంతమంది ప్రాణములు విడిచారు. ధర్మజునికి చాలా దెబ్బలు తగిలినవి. చేయునది లేక ధర్మజుడు తన బసకు వెళ్ళినాడు. ధర్మరాజుతో కర్ణుడు యుద్ధము చేయునప్పుడు అర్జునుడు మరొకవైపునకు యుద్ధమునకు పోవటముచేత ధర్మరాజునకు సరైన సహాయము లేకపోయినది. అవమాన భారముతో ఉద్రేకమును యేమాత్రమూ అణగద్రొక్కుకోలేని బలహీనుడైనాడు ధర్మరాజు, అర్జునుడు వచ్చేవరకు వేచియున్నాడు. కొంతసేపటికి అర్జునుడు ధర్మజుడు బసను ప్రవేశించాడు. తన బాధను తన ఉద్రేకాన్ని సహించుకోలేని మానవుడు కనుక, మానవత్వములోని బలహీనతచేత ధర్మజుడు అర్జునుని, అతని గాండీవాన్ని తూలనాడినాడు. ధర్మజుడు అర్జునుని చూచి, 'అర్జునా! నీవు , నీ గాండీవము నిష్ప్రయోజనము. ఎంతో తపస్సు చేసి గాండీవాన్ని చేపట్టిన నీ శక్తిసామర్థ్యములు నిరుపయోగము. కర్ణుడు మన సైన్యమును ఛిన్నాభిన్నము చేస్తుంటే నీ గాండీవము సహాయము చేయలేకపోయినప్పుడు నీవెందులకు?' అని అనేకవిధములుగా తూలనాడినాడు. ధర్మజుడు

ఉద్రేకముగా మాట్లాడేటప్పటికి అర్జునునికి కూడా ఉద్రేకము వచ్చి, ఇరువురూ కొంత తర్కాన్ని పెంచుకున్నారు. అర్జునునికి భరించలేని ఉద్రేకము వచ్చి గాండీవాన్ని తీసి ధర్మజుని కొట్టటానికి ప్రయత్నము చేసినాడు. సమయానికి కృష్ణమూర్తి అక్కడకు వచ్చినాడు. వచ్చి, కృష్ణుడు ఆ సమయములో ప్రదర్శించిన వినయవిధేయతలు, కల్పించిన సన్నివేశము పాండవులు జీవించి ఉన్నంతకాలము మరువలేనివి. కృష్ణుడు అర్జునుని చేతులు పట్టుకున్నాడు. అర్జునునికి అనేకవిధముల ఉపదేశము చేశాడు. అన్నను తూలనాడటం న్యాయం కాదనీ, కేవలం, ఈ యుద్ధరంగంలో నీకు కలిగిన విరక్తియే యిటువంటి ఉద్రేకాలకు మూలకారణమని చెప్పి, అతనిని శాంతపరచి, తక్షణమే ధర్మజుని దగ్గరకు వెళ్ళి అతని కాళ్ళు గట్టిగా పట్టుకొని, 'ధర్మజా! నీవు అర్జునుని క్షమించినాను అని చెప్పేవరకు నీ పాదములు విడువను' అని చాలా వినయవిధేయతలు ప్రదర్శించాడు. ఇంకనూ, 'ధర్మజా! పంచప్రాణస్వరూపులైన పాండవులమధ్య ఈవిధమైన భేదాభిప్రాయములు పెరిగి మీ సోదరత్వము ఛిన్నాభిన్నమైనచో అది భారతదేశ నాశనానికి ఒక కారణమవుతుంది. కనుక, ఈసమయంలో నీవు అర్జునుని క్షమింపకున్న నేనొక్క క్షణమైనా నిలువటానికి వీలులేదు' అని అతని పాదములు గట్టిగా పట్టుకున్నాడు. ఈవిధమైన కృష్ణుని ప్రవర్తన చూచి ధర్మజునికి కంటినుండి అశ్రుధారలు కారినవి. ధర్మజుడు కృష్ణుని లేవనెత్తి కౌగలించుకొని, 'స్వామీ! లోకారాధ్యుడైన నీవు తుచ్ఛమైన నా పాదములు పట్టుకోటమేమిటి? మా సోదరుల మధ్య ఈవిధమైన భిన్నత్వమును ఛేదించుటకు తగిన వినయాన్ని ప్రకటించటానికి చేసిన ప్రయత్నమే తప్ప అన్యము కాదు' అని చెప్పి తక్షణమే అర్జునుని వద్దకు వెళ్ళి, అతనిని కౌగలించుకొని, 'తమ్ముడా! నేను ఉద్రేకములో మానవత్వపు బలహీనతచేత నిన్ను తూలనాడి కఠినపు మాటలతో బాధించాను. నన్ను క్షమించు' అని అర్జునుని ప్రార్థించాడు. కృష్ణుడు ఈవిధమైన చర్య తీసుకోటానికి గల కారణమేమిటి? కృష్ణుడు ధర్మజుని పాదములెందుకు పట్టాలి? ఎందుకోసము ఈవిధమైన కష్టనష్టాలకు గురికావాలి? ఈవిషయాన్ని విచారించినప్పుడు దీనికి పాండవులపైన కృష్ణునికి గల ప్రేమయే అని తెలుస్తుంది. భక్తులపైన ప్రేమవలన భగవంతుడు అనేకవిధములైన చేయరాని చిన్నచిన్న కార్యములనుకూడా తాను అల్పుడుగా భావించుకొని చేస్తాడు.

అది మహాభారతయుద్ధము. భీష్ముడు తొమ్మిది దినములు యుద్ధము జరిపినాడు. తీవ్రమైన యుద్ధము జరిగే సమయములో ఒకానొక దినమున దుర్యోధన దుశ్శాసనులు వెళ్ళి భీష్ముని ప్రార్థించారు. 'స్వామీ! యుద్ధము ప్రారంభించినది మొదలు మనకు అపజయమే కలుగుతున్నాది. ఏనాడు జయము అనే సువార్తను వినగలము!' అని విచారాన్ని వెలిబుచ్చారు. భీష్ముడు సర్వజ్ఞుడు. సర్వధర్మస్వరూపుడు. అయిననూ దుర్యోధనాదులకు స్వాధీనుడై ఉండుటచేత, వారి ఆజ్ఞకు బద్ధుడై ఉండుటచేత వారికి వాగ్దానము చేశాడు. 'రేపటి దినము పాండవులను జయించి వారిని అనేకవిధములైన చింతలకు గురిచేతు'నని వాగ్దానము చేశాడు. అందులకు దుశ్శాసనుడు,'స్వామీ! వారిని అనేకవిధములైన హింసలకు గురిచేసి ప్రయోజనము లేదు. వారి ప్రాణములు ప్రధాన లక్ష్యముగా ఉంచుకోవాలి' అని ప్రార్థించాడు. అందువలన భీష్ముడు, 'రేపటిదినము సూర్యోదయమైన తక్షణమే పాండవులను హతమార్చగల'నని వాగ్దానము చేశాడు. ఈ వార్త పాండవులకు తెలిసింది. పితామహుడైన భీష్ముడు ఈ ప్రతిజ్ఞను తప్పక నెరవేర్చగలడనే సత్యాన్ని గుర్తించి పాండవులు చేయునది లేక ఏ పితామహుడు మమ్ములను పెంచి పెద్ద చేసెనో ఆ పితామహునికే ఈ ప్రాణములను అర్పించుకుందామని సంసిద్ధులైనారు. ఈ వార్త ద్రౌపదికి తెలిసింది. ద్రౌపదికి నిద్ర పట్టలేదు. భుజించటానికి యిష్టపడలేదు. 'పతులను ధారపోసుకుంటున్నాను' అనే మహా భయంకరమైన బాధకు గురైంది. రాత్రి అయినది. చిమ్మచీకట్లు కమ్ముకొని వచ్చినవి. అప్పుడు కృష్ణుడు తగిన పన్నాగము పన్ని ఏవిధముగా ఈ పురుషార్థాన్ని ప్రవేశపెట్టి యితరుల మనస్సును మార్చవచ్చునో దానికి తగిన పథకమును తయారుచేసుకొన్నాడు. ఆసమయంలో ఏదో వాగ్దానము చేసిననూ ధర్మమూర్తులైన పాండవుల చిత్తాన్ని ఎరిగిన మహాపురుషుడు కనుక, భీష్మునికి కూడా మనసు యేమాత్రమూ సరిలేదు. అతనికి అన్నము సహించలేదు. ఒక్క ప్రదేశములో కూర్చోటానికి మనసొప్పలేదు. అనేకవిధములుగా పిచ్చిపట్టిన వానివలె తిరుగుతున్నాడు తన వసతి గృహములో, ఇరుప్రక్కలవారి చిత్తములు ఎరిగిన మహాపురుషుడు కృష్ణుడు కనుక, తగిన సమయము ఆసన్నమయ్యే నిమిత్తము కాచుకొని ఉన్నాడు. భోజనము చేసి వసారాలో కూర్చొని ఉండగా ద్రౌపది కృష్ణుని పాదములపైబడి అనేకవిధములుగా

మొరపెట్టుకొన్నది. కష్ణుడు 'చెల్లీ! నీవు బాధపడనక్కరలేదు. నీవు చేయవలసిన ప్రార్థన నీవు చెయ్యి. నీ కర్తవ్యము, నీ ధర్మము నీవు నిర్వర్తించుకొనియుండు. తరువాత నేను చేయవలసిన కార్యము నేను చేస్తాను' అని అన్నాడు. సరి, ఎన్ని చెప్పినా స్త్రీబుద్ధి కనుక, భరించలేని బాధతో కుములుతూ యింటికి తిరిగి వచ్చింది. కృష్ణుడు సరిగా అందరూ నిద్రించే సమయములో రాత్రి పదకొండు గంటలకు ద్రౌపది యింటికి వచ్చినాడు. 'ద్రౌపదీ! నన్ను అనుసరించు. నీవు ఏ ప్రశ్న వేయుటకు పూనుకోకు' అని ఆజ్ఞాపించాడు. ద్రౌపది ఒక బురఖా వేసుకొని (యుద్ధరంగము కనుక) తాను యెవరికీ తెలియని విధముగా కృష్ణుని అనుసరించినది. యుద్ధరంగములో పెద్ద భవనాలుండవు. వసతి గృహములుగా అప్పటికప్పుడు తయారు చేసిన గుడారాలు వేసుకున్నారు. భీష్ముని వసతి గృహము చాలా పెద్దదిగా ఉంది. ఆ పదకొండు గంటలప్పుడు, 'ఇంక తెల్లవారుతుంది. రేపటి దినము పాండవులను నేను హతమార్చవలసి వస్తుంది. ఏరీతిగా చెయ్యాలి? కౌరవుల బోధలను పురస్కరించుకొని నేను అన్యాయమునకు పూనుకోవలసి వచ్చిందే' అని నిద్ర లేకుండా అటుయిటు తిరుగుతూ బాధపడుతున్నాడు భీష్ముడు. కొంతదూరము ఉండగానే కృష్ణుడు ద్రౌపదికి సైగచేసి, 'అమ్మా! ఇప్పుడు నీవు యేమాత్రము ఆలస్యము చేయక, నీ చెప్పులు అక్కడ వదలి పెట్టు' అన్నాడు. ఆనాటి మహారాజుల చెప్పులు ఫర్లాంగు దూరములోనుంచే కిఱ్ఱుకిఱ్ఱుమని శబ్దము చేసేవి. ద్రౌపది కృష్ణుని ఆజ్ఞను అనుసరించి చెప్పులు ఒకచోట వదలిపెట్టి, నిండుగ కప్పుకొని, కృష్ణుని మాటలు తన మనస్సులో నుంచుకొని పరిగెత్తుకొని పోయి, 'పతిభిక్ష, పతిభిక్ష, పతిభిక్ష' అంటూ భీష్ముని పాదములపై పడింది. దయ భీష్ముని సహజ స్వభావము కనుక, స్త్రీ వచ్చి పాదములపై పడిన తక్షణమే ఆయన, 'దీర్ఘసుమంగళీభవ' అని దీవించాడు. ఈ ఒక్క వాక్యమే ఆమెకు చాలు. రెండు చేతులు పట్టి పైకెత్తి చూసి, 'ద్రౌపదీ! నీవా? నేనెంత పొరడిపోయాను' అని ఈ రెండు వాగ్దానములలో దేనిని నేను సాధించాలి అనే సందిగ్ధావస్థలో మునిగిపోయాడు భీష్ముడు. ద్రౌపది తనకు పతిభిక్ష పెట్టమని, తాను దీర్ఘసుమంగళిగా ఉండాలని ప్రార్థిస్తుండగా భీష్ముడు ఆమెను ప్రశ్నించాడు. 'నీకు ఈ ఉపాయము నేర్పినవారెవ్వరు? ఈ రాత్రిలో నా భవనానికి వచ్చి ఈవిధమైన సాహసానికి పూనుకొనే ధైర్యము నీలో లేదు కదా! నీకెవరో ఆధారముగా ఉన్నారు. దీనికి ఎవరో కారణముగా ఉన్నారు. వారెవ్వరు? ఈ అర్ధరాత్రి ఒంటరిగా ఏరీతిగా వచ్చావు? వెంట ఎవరు వచ్చారు?' అని అనేకవిధములుగా ప్రశ్నల వర్షము కురిపించాడు భీష్ముడు. ఇంతలో నటన సూత్రధారియైన కృష్ణుడు అక్కడ ప్రత్యక్షమైనాడు. భీష్ముడు సంతోషించి, 'కృష్ణా! ఇది భక్తవాత్సల్యముతోకూడిన సహజ ప్రేమయే తప్ప అన్యము కాదు. అన్యాయ, అక్రమ, దురాచారములు నేను అనుసరిస్తుంటే నాకు కనువిప్పు కలిగిస్తున్నావు. ఈ వాగ్దానములకు నీవే సరియైన సారథివి. నీవే తగిన నాయకుడవు' అని అనేకవిధములుగా పలుకుతూ, 'స్వామీ! అదేమిటి? ఆ చంకలో వస్త్రములో చుట్టుకొన్న పదార్థము ఏమిటి?' అని అడిగాడు. అంగవస్త్రములో చుట్టుకొని వచ్చినవి విప్పి చూస్తే ద్రౌపది వేసుకొన్న చెప్పులు. భక్తవాత్సల్యమునందు, భక్తరక్షణయందు అప్రమత్తుడై ఉండుటయేకాక, భక్తులకు తగిన ఉపాయములు చెప్పుటయే కాకుండా, భక్తుల చెప్పులుకూడా మోసే పనియందు సంసిద్ధుడుగ భగవంతుడు ఉంటాడు. ఈ దృశ్యాన్ని చూచి ద్రౌపది కంటిధారలు కాలువలుగ ద్రవించినవి. 'ఏమిటి? తుచ్ఛమైన చెప్పులను తమరు కాపాడుకుంటూ రావలెనా? ఈ దేహానికి పతిభిక్ష పెట్టినది చాలదా! మమ్ములను యింతకాలము ఉద్ధరించి అనేక కష్టనష్టములనుండి రక్షించి, క్షణక్షణము కూడా కంటిరెప్పవలె కాపాడినది చాలదా? మా తుచ్ఛమైన చెప్పులు కూడా కాపాడవలెనా?' అని అన్నను వర్ణించుకుంటూ కంటిధారలతో తన కృతజ్ఞతను అందించింది. ఇలాంటి పనులన్నీ దేవుడై చేసినాడా? కాదు, కాదు. తన దైవత్వాన్ని ప్రక్కకు పెట్టాడు. మానవులకు మానవులకు మధ్య ఏవిధమైన సన్నిహితసంబంధం ఉండాలి అనేది ప్రత్యక్షస్వరూపుడై తాను అనుసరించి లోకానికి ఆదర్శాన్ని అందించాడు. ప్రేమ జీవితమునకు ఆధారమని, ఆహారమని, సత్యమే జీవితమునకు శ్వాస అని నిరూపించాడు.

భగవంతుని లీలలు చాలా విచిత్రముగా కనిపిస్తాయి. వీనివల్ల మానవునకు అనేక సందేహములు కలుగుతాయి. మహాభారతయుద్ధము నలువైపులా ముంచుకు వచ్చింది. ద్రోణుడు ఒకవైపున పద్మవ్యూహము పన్నినాడు. మరొకవైపు సంశప్తకులు సంసిద్ధులై వచ్చినారు. కర్ణుడు ఒకవైపు సంసిద్ధముగా ఉన్నాడు. కర్ణుని ఎదుర్కొనుటకు కొంతమంది బయలుదేరినారు. నకులుడు, సహదేవుడు మరొకవైపు వెళ్ళినారు. అర్జునుడు సంశప్తకులపై యుద్ధానికి వెళ్ళినాడు.

ఈవిధముగా నలుదిక్కుల భయంకరమైన యుద్ధము జరుగుతున్నది. ఇంటిదగ్గర బాలుడైన అభిమన్యుడు ఉన్నాడు. 'పద్మవ్యూహము పన్నినాను. తప్పక యుద్ధమునకు వచ్చి. ఈ వ్యూహమును సాధించి జయించాలి' అని ద్రోణాచార్యుడు వర్తమానము పంపాడు. 'యుద్ధమునకు రమ్మని పిలచిన మహావీరునితో రానని చెప్పుట క్షత్రియధర్మము కాదు. ఒకవేళ రానని చెప్పినా, నా తండ్రికి అపకీర్తి తెచ్చినవాడనౌతాను. ఆ తండ్రికి పుట్టి ఆ తండ్రి కీర్తిని నాశనము చేసినవాడనౌతాను. నా తండ్రి కీర్తిని నిలబెట్టాలి. క్షత్రియధర్మము నిలబెట్టాలి' అనే ఉద్దేశ్యముతో అభిమన్యుడు యుద్ధమునకు సిద్ధమైనాడు. పద్మవ్యూహమునకు వెళ్ళినాడు, ప్రాణములు కోల్పోయినాడు. ఈవిషయము కృష్ణునికి తెలియనిది కాదు. వేరే యుద్ధస్థానము నుండి కృష్ణుడు అర్జునునితో కలసి వస్తున్నాడు. నివాసము సమీపించే కొలది అర్జునుని మనస్సుకు బలహీనత యేర్పడినది. 'నే వచ్చునంతనే యెదురేగుదెంచును యేలకో అభిమన్యుడెదురురాడు' అని యోచిస్తున్నాడు అర్జునుడు. అతనికి అపశకునాలు కనిపిస్తున్నాయి. అక్కడినుండే కృష్ణుడు వేదాంతము ప్రారంభిస్తున్నాడు. ' ఎవరు తండ్రి? ఎవరు కుమారుడు? పుట్టక పూర్వము ఎవరు కుమారుడు? పెండ్లిచేసుకోక పూర్వము ఎవరు భార్య? ఒకరికొకరికి సంబంధము లేదు. దేహభ్రాంతులు పెట్టుకోకూడదు. యుద్ధములో అన్నింటకి సిద్ధముగా ఉన్నాము. ఏ నిమిషములో ఎవరు ప్రాణము కోల్పోతారో?' అని బోధించాడు. 'నిజమా? కాదా? అర్జునా! చెప్పు' అని ప్రశ్నించాడు. 'ఆ! నిజమే స్వామీ! ఎవరి జీవితాలు ఎక్కడో? ఏనిమిషములో ఎప్పుడో!' అని అర్జునుడు తాళము వేస్తున్నాడు. 'నిజముగా హృదయపూర్వకముగా చెప్తున్నావా? నన్ను సంతృప్తి పరచుటకు చెప్తున్నావా?' అని మరొక ప్రశ్న వేశాడు కృష్ణుడు. 'అలాంటి మాటలు చెప్పేది కృష్ణుడు కాదు, పలికేది అర్జునుడు కాదు. అర్జునుడు హృదయపూర్వకంగా పలుకుతున్నాడనే సత్యమును గుర్తించు కృష్ణా! ఇంకా నన్నెందుకు సందేహిస్తున్నావు?' అన్నాడు. 'అట్లా అయితే అభిమన్యుడు చనిపోయనాడనే వార్త వచ్చిందనుకో, దానికి విలపిస్తావా లేక ధైర్యసాహసములు అవలంబిస్తావా?' అన్నాడు. దీనికి కంగారుపడి అర్జునుడు, 'కృష్ణా! నీవు తమాషాకు చెప్తున్నావా లేక సత్యము చెప్తున్నావా? అభిమన్యుడు ఎలా ఉన్నాడు?' అని కంగారుగా ప్రశ్నించాడు. 'అర్జునా! అభిమన్యుడు వీరస్వర్గమును అలంకరించాడు' అన్నాడు కృష్ణుడు. ఈ మాటలు విన్న తక్షణమే అర్జునుడు వెనుకముందు యోచించకుండా, 'కృష్ణా! వంశనాశీ!' అన్నాడు. 'కృష్ణా! ఎంత పని చేసితివి! నిన్ను నమ్ముకొని, నిన్నే ఆశ్రయించి, నీ మాటలు శిరసావహించి జీవిస్తున్న పాండవుల వంశమునే నాశనము చేసితివి కదా!' అని యిష్టము వచ్చినట్లు హస్తినాపురము చేరేవరకు దూషించాడు. కృష్ణుడు ఎన్ని బోధలు చేసినా అర్జునుని తలకు ఎక్కవు కనుక, తన మాటలు వ్యర్థమౌతాయి కనుక ఆసమయమున మూసినటువంటి తన నోరు కృష్ణుడు ఇంక యేమాత్రమూ తెరువలేదు. ఎవ్వరు యేది చెప్పినా సరైన జవాబు యివ్వటానికి కాలము రావాలి. సమయము వచ్చేవరకు జవాబు చెప్పటానికి పూనుకోరు అవతారపురుషులు. అవతారములో ఎట్టి దోషము ఉండదు. ఎవరి వ్రేలితో వారి కన్ను పొడిచే స్వభావము అవతారపురుషులది. భగవంతుడు ఎప్పుడూ సాక్షీభూతుడుగా ఉంటాడు. ఇంటికి వెళ్ళిన తరువాత కుటుంబము లోనివారంతా దుఃఖిస్తున్నారు.

సుఖదుఃఖములు శాశ్వతము కావు. సుఖము తర్వాత దుఃఖము, దుఃఖము తర్వాత సుఖము వస్తుంటాయి. దుఃఖము ఎంత దుఃఖమనుకొన్నప్పటికి అది మారిపోతుంది. స్థిరముగా దుఃఖమును లోకములో ఎవ్వరూ అనుభవించరు. కాలము కదలిపోతూ వచ్చింది. ఈ పరిస్థితులలో ఉత్తరకు ప్రసవవేదన ప్రారంభమైంది. జన్మించిన కుమారుడు జీవచ్ఛవమువలె ఉన్నాడు. సుభద్ర బాధపడుతున్నాది. ప్రసవ వార్త వినుటకు పాండవులు కాచుకొని ఉన్నారు. కారణమేమనగా ద్రౌపది వృద్ధాప్యము పొందినది. సుభద్రకు వృద్ధాప్యము ప్రారంబమైంది. వారి వంశము అభివృద్ధి అగుటకు అవకాశము లేదు. ఉత్తరకు కుమారుడు పుట్టినచో వంశము నిలుస్తుంది. లేకపోతే పాండవుల వంశము నాశనమైపోతుంది. సువార్తను వినే నిమిత్తమై పాండవులు చెవులు నిక్కబెట్టుకొని కూర్చున్నారు. అప్పుడు ద్రౌపది పాండవుల దగ్గరకు ఒక తట్టలో నిర్జీవమైన బిడ్డను తీసుకొని వచ్చి చూపి భోరుమని ఏడ్చింది. ఆనాడు అశ్వత్థామ, అర్జునుడు ఇరువురు యుద్ధము చేసినప్పుడు వారు విడిచిన బ్రహ్మాస్త్రము, పాశుపతాస్త్రముల ప్రభావమే గర్భములో ఉన్న శిశువు మరణించుటకు కారణము. దీనిని చూసిన పాండవులు నిరుత్సాహములో మునిగిపోయినారు. ధర్మజుడు కృష్ణుని తీసుకొని రమ్మని అర్జునుని పంపినాడు.

కృష్ణుడు తక్షణమే అర్జునునితో వచ్చినాడు. 'ఎలుకకు ప్రాణ సంకటము, పిల్లికి చెలగాటము' మాదిరిగా పాండవులు విచారములో మునిగి ఉంటే కృష్ణుడు చిరునవ్వుతో చిందులు త్రొక్కుతూ లోపలికి వస్తున్నాడు. 'ధర్మజా! ఎందుకు విచారిస్తున్నావు? అర్జునా! నీవెందుకు శోకిస్తున్నావు?' అని తమాషాలు చేస్తున్నాడు. తక్షణమే ద్రౌపది తట్టను తెచ్చి కృష్ణునికిచ్చి, 'అన్నా! వంశమంతా ఈరకముగా చేసితివా!' అని ఏడ్చింది. కృష్ణుడు తట్టను చేతిలోనికి తీసుకున్నాడు, 'ఆహా! ముక్కు అభిమన్యుని ముక్కులాగే ఉంది. కన్నులు అభిమన్యుని కన్నులులాగనే ఉన్నాయి' అని వర్ణించాడు. ధర్మజుడు, 'అవునవును, శ్వాసకూడ అభిమన్యుని శ్వాసను పోలి ఉంది' అన్నాడు. 'ఏమీ! ప్రాణము లేదా!' అని అటుయిటు ఊపుతూ పరిక్షచేసినంతనే పిల్లవాడు ఏడ్చినాడు. పాండవుల ఉత్సాహము హద్దులు మీరింది. 'కృష్ణా! కృష్ణా!' అని ఒక్కసారి కృష్ణుని కౌగలించుకున్నారు. 'వంశోద్ధారకా!' అని అర్జునుడు అరచినాడు.

కృష్ణుని అర్థాంగియైనసత్యభామయే అసూయతో నిండియుంటే అతనికి చెడ్డ పేరు రాగలదు. కనుక, మొట్టమొదట సత్యభామ అసూయను రూపుమాపాలని శ్రీకృష్ణుడు సంకల్పించుకొన్నాడు. అదే 'శ్రీకృష్ణతులాభార' ఘట్టం.

ఒకనాడు నారదుడు ఇంటికి వచ్చినప్పుడు సత్యభామ, 'నారదా! కృష్ణుడు నావాడు కావటానికి ఏదైనా జపమో, తపమో, యంత్రమో, మంత్రమో, తంత్రమో బోధించమని కోరుతున్నాను' అన్నది. అంతకుముందే కృష్ణుడు ఒక మాస్టర్‌ప్లాన్ రూపొందించి నారదునికి బోధించాడు. నారదుడు శ్రీకృష్ణుని ఆదేశానుసారం సత్యభామతో, 'అమ్మా! దీనికొక వ్రతముంటున్నాది. ఆ వ్రతాన్ని మూడు రోజులపాటు ఆచరించాలి. తరువాత నాల్గవ రోజున నీవతనిని ఎవరికైనా దానమివ్వాలి. అప్పుడా దానము స్వీకరించిన వ్యక్తికి నీ పతిని సరితూచగల ధనాన్ని చెల్లించినచో నీ పతి నీవాడౌతాడు. ఇంకెవ్వరివాడు కాడు' అన్నాడు. అప్పుడు సత్యభామ, 'శ్రీకృష్ణుడు నావాడు కావటానికి ఏ వ్రతమునైనా చేస్తాను. నా తండ్రి ఇచ్చిన శ్యమంతకమణి ప్రభావముతో దినానికి ఎంతో బంగారము తయారౌతుంది. కనుక, కృష్ణుని సరితూచగల ధనము నా దగ్గర లేకపోలేదు. కావలసినంత ధనం వున్నది. ఈ ధనంతో కృష్ణుడు నిరంతరం నావాడుగానే వుండేటట్లు చేస్తాను' అని అహంకారంతో విఱ్ఱవీగింది. ఈవిధంగా, అసూయకు అహంకారంకూడా తోడైంది. ఈ రెండూ చేరేసరికి ఆమెలో పట్టలేనంత చెడ్డ భావాలు ప్రారంభమైనాయి.

నారదుని సలహాననుసరించి ఆమె వ్రతము గావించింది. మూడు దినములైన తరువాత, 'నారదా! శ్రీకృష్ణుని ఎవరికి దానమిచ్చేది?' అని ప్రశ్నించగా, నారదుడు, 'సత్యాభామా! ఇంతమాత్రమునకే వగచుట ఎందుకు? నేనున్నాను కదా! ఆ దానమును నాకే ఇవ్వు' అన్నాడు. 'ఆహా! బ్రహ్మమానస పుత్రుడైన నారదునికి నా పతిని దానమిచ్చి, తిరిగి అతని నుండే నా పతిని తీసుకోటం కంటే మహద్భాగ్యం వేరొకటి లేదు' అని సత్యభామ ఆనందించింది. త్రాసులో కృష్ణుడు ఒకవైపున కూర్చున్నాడు. కృష్ణుని తూచటానికి ఎక్కువ నగలు అవసరం లేదని సత్యభామ తలచి, మొట్టమొదట కొన్ని నగలను మాత్రమే తెచ్చి త్రాసుయొక్క రెండవవైపున వుంచింది. కాని, త్రాసు కదలలేదు. ఏమాత్రం మెదలలేదు. ఇంక, చివరికి అన్నీ తెచ్చి వేసింది. కాని, ఎంత వేసినప్పటికీ త్రాసు వెంట్రుకవాసి అయినా కదలలేదు. క్రమక్రమేణా సత్యభామలో అహంకారం అణగిపోతూ వచ్చింది.

నారదుడు సత్యభామ పరిస్థితి గమనించి, 'అమ్మా! నీవింక ఈ వ్రతాన్ని మానుకో. నేను కృష్ణుని బజారులోనికి తీసుకువెళ్ళి అమ్మటానికి ప్రయత్నిస్తాను' అన్నాడు. 'అయ్యో! కృష్ణుని ఎవరైనా కొంటారేమో' అని సత్యభామకు మరొ భయం కలిగింది. వెంటనే రుక్మిణి వద్దకు పరుగెత్తివెళ్ళింది. అంతకుముందు ఏనాడూ తాను రుక్మిణి వద్దకు వెళ్ళి ఎరగదు. శ్రీకృష్ణుని పట్టపురాణి కావటం చేత ఆమెపై సత్యభామకు పట్టలేనంత కోపం వుండేది. 'అక్కా! నారదుడు మన పతిని బజారులో పెట్టి అమ్మటానికి ప్రయత్నిస్తున్నాడు. ఇంక, మన గతేమిటి?' అన్నది సత్యభామ. రుక్మిణి నిర్మలచిత్తురాలు. ఆమెయందు క్రోధంగాని, ద్వేషంగాని, అసూయగాని లేవు. ఆమె సత్యభామతో, 'సత్యా! నీవు భయపడనక్కరలేదు. మన పతి మన పతియే. శ్రీకృష్ణుడు కేవలం మన పతియేకాదు. అతడు జగత్పతి, లోకపతి, విశ్వపతి, ప్రాణపతి. ఇట్టి తత్త్వాన్ని నీవు సంకుచిత దృష్టితో చూడటం నీ వెఱ్ఱితనం' అన్నది. ఈ మాటలను విని సత్యభామ, 'అక్కా! ఈ వేదాంతం నాకర్థం

కాదు. నివు తక్షణమే వచ్చి మన పతి మనకు దక్కేలా చూడాలి' అన్నది.

ఆ సమయంలో రుక్మిణి 'తులసి పూజ' చేసుకుంటున్నాది. తన నిత్యజీవితంలో పూజానంతరం ఒక 'తులసిదళం' త్రుంచుకొని భుజించటం అలవాటు. కాని, సత్యభామ తొందర పెట్టటం వలన తాను త్రుంచిన తులసిదళాన్ని చేతిలోనే వుంచుకొని కృష్ణుని చెంతకు వచ్చింది. అప్పటికే నారదుడు కృష్ణుని తన వెంట తీసుకొని వెళ్ళటానికి సిద్ధంగా వున్నాడు. అంతలో రుక్మిణి రాకను గమనించిన కృష్ణుడు ఇంకా విచారంగా ముఖము పెట్టి, 'సత్యా! రుక్మిణి! ఈనాటినుండి మీకు నాకు ఎడబాటు సంభవిస్తోంది' అన్నాడు. ఆ మాటలను విన్న సత్యభామ మరింత దిగులు పడింది. అప్పుడు రుక్మిణి, 'నారదా! శ్రీకృష్ణుని తూచటానికి అతని నామమే సరియైనది. రూపమునకు నామము, నామానికి రూపమే సరియైన తూకం. దానిని మించిన ధనం మరొకటిలేదు' అని పలికి, 'కృష్ణా!' అంటూ కృష్ణనామాన్ని స్మరించింది. కాని, నారదుడు అంత సులభంగా ఒప్పుకునేవాడు కాదు. 'అమ్మా! ఆకార కృష్ణునకు వికారమైన నామాన్ని వేస్తే నాకు లభించే అదాయమేమిటి? నాకుకూడా కొంత ఆదాయము కావాలి' అన్నాడు. 'నారదా! నీకు కావలసినది సాకారమే కదా!' అని, తాను కృష్ణునివైపు తిరిగి

'పత్రమో పుష్పమో ఫలమో తోయమో
భక్తి కల్గిన వానికి వశుడవౌట సత్యమేని
కృష్ణా.....! నీవు ఈ తులసీ దళమునకు తూగుదువుగాక'

అన్నది. అనగా కృష్ణుని తూకానికి కృష్ణుడినే ప్రార్థించింది. అంతేగాని, తన కృష్ణుని తనకు దక్కించమని రాముడినో, ఈశ్వరుడినే, విష్ణువునో ఆమె ప్రార్థించలేదు. ఆవిధంగా ప్రార్థించి, 'కృష్ణా!' అని స్మరిస్తూ తన చేతిలోని తులసీ దళాన్ని ఆ త్రాసులో వుంచింది. కృష్ణరూపాన్ని కృష్ణనామము సమముగా తూచింది, ఆ తులసీదళం extra weight అయింది.

అప్పుడు కృష్ణుడు చెప్పాడు, 'రుక్మిణియొక్క భక్తిప్రపత్తులే ఈ బంధవిమోచనమునకు మూలకారణము. అహంకార అసూయలు అధఃపతనానికి దారితీస్తాయి' అన్నాడు. అప్పుడు సత్యభామ రుక్మిణి పాదాలు పట్టుకొని, 'అక్కా! నీయంతటి భక్తిప్రపత్తులు నాకుకూడా కలుగునట్లు దీవించు' అని ప్రార్థించింది. ఆనాటినుండి ఆమె తన అహంకారాన్ని చల్లార్చుకుంది. అప్పుడు కృష్ణుడు సత్యభామను వెంటతీసుకొని ఆమె ద్వారానే నరకాసురుని సంహరించాడు. ఇది ప్రాకృతమైన చరిత్ర.

కృష్ణతత్త్వమునందు అనేకవిధములైన విషయాలు, అంతరార్థములు వున్నాయి. కృష్ణునికి ఎనిమిదిమంది ప్రధానమైన రాణులు. ఇంతే కాకుండా పదునారువేలమంది గోపికలు భార్యలని. దీని అంతరార్థమేమిటి? వీరు ప్రాపంచిక సంబంధమైన భార్యలు కారు. ఇక్కడ ఆరు దళములతో చక్రములుంటున్నాయి. ఈ షట్చక్రములందు రెండు ప్రధానమైనవి. సహస్రార చక్రము ఒకటి, హృదయ చక్రము ఒకటి. ఈ హృదయపుష్పము అనేది అష్టదళములతో కూడినది. ఈ ఎనిమిది దళములకు అష్టభూములని మరొక పేరు. ఈ భూమికి నాథుడు భగవంతుడు. ప్రకృతి, పరమాత్మ. ప్రకృతికి మాస్టరు పరమాత్మ. కనుక, ఈ అష్టదళములకు నాథుడు భగవంతుడు. కనుక, హృదయ పద్మమునకు అష్టదళములు, అష్టభూములు. కనుకనే దీనికి నాథుడు భగవంతుడు. హృదయమే దీనికి అత్యంత ప్రధానమైనది. కనుక, ప్రతి మానవుని హృదయపు అష్టదళములుకు భగవంతుడే అధిపతి. ఇతనినే మాధవ అన్నారు. మా- అనగా లక్ష్మి, మాయ. ధవ- నాథుడు. మాధవ అనగా హృదయానికి నాథుడు. భూమికి నాథుడు. మాయకు నాథుడు. లక్ష్మీనాథుడు అని. కనుక, అష్టదళములతో కూడిన హృదయమునకు నాథుడు భగవంతుడు. అతడే కృష్ణుడు. సహస్రారము కట్టకడపటి చక్రము. సహస్రారమనగా వేయిదళములతో కూడినది. ఒక్కొక్క దళమునందు భగవంతుడు షోడశ కళలతో నిండి వుంటున్నాడు. షోడశకళాప్రపూర్ణుడు భగవంతుడు. ఒక్కొక్క దళమునకు పదహారు కళలు వుంటున్నాయి. కాబట్టి, వేయి దళములలో పదహారువేల కళలుంటున్నాయి. కనుకనే, పదహారువేలమంది గోపికలు. కనుక, గోపికలనగా కళలే. గో- అనగా శబ్దము, ప్రాణము. ఈ సహస్ర దళములకు తానే అధిపతి. కనుకనే, కృష్ణునకు పదహారువేలమంది గోపికలన్నారు.

భాగవతమునందుండిన మహా పవిత్రమైన సూక్ష్మార్థమును ఎవరూ గుర్తించటానికి ప్రయత్నించటం లేదు. కృష్ణునికి పదహారువేలమంది గోపికలు, ఎనిమిదిమంది రాణులు ఏమిటి? ఇవన్నీ పిచ్చిపిచ్చి భావాలుకాదా! ఇదికాదు ప్రధానమైనది. పదహారు కళల లోపల ప్రారంభము కావాలి. భగవంతుని ఆజ్ఞ శిరసావహించినప్పుడే ఆ పదహారు కళలు మన సహస్రారములో వికసిస్తాయి. మూలాధారమునుండి ప్రారంభమైన కుండలినీ శక్తి సహస్రారములోనికి పోయి వికసిస్తుంది. ప్రాణవాయువే దీనికి ప్రధానమైన మూలాధారము. అదే ప్రేమ. ఈ ప్రేమ ప్రాణవాయువుగా మన మూలాధారములో ప్రారంభమై సహస్రారములో నిలిచిపోవాలి.

రాజసూయయాగ సందర్భంగా ధర్మరాజు కృష్ణునికి అగ్రతాంబూలమొసంగినందులకు శిశుపాలుడు అతనిని నిండుకొలువులో విమర్శించసాగాడు. కృష్ణుని పరమ నీచంగా దూషించసాగాడు. ఆ దూషణలను ధర్మరాజు భరించలేకపోయాడు. అతని మనస్సు పరిపరివిధములుగా అశాంతికి గురియైనది. కాని, మరుక్షణంలోనే అందరూ చూస్తుండగనే శ్రీకృష్ణుడు తాను ఏ పళ్లెంలో అగ్రతాంబూలాన్ని స్వీకరించాడో, దానినే శిశుపాలునిపైకి విసిరాడు. అది వెళ్ళి శిశుపాలుని కంఠాన్ని కోసివేసింది. ధర్మరాజు ఆ దృశ్యాన్ని చూచి సంతోషించాడు. ఐతే, మరుక్షణంలోనే ఆ శిశుపాలుని రక్తం చింది శ్రీకృష్ణుని పాదాలపై పడింది. వెంటనే శిశుపాలుని 'జీవనజ్యోతి' వెళ్ళి శ్రీకృష్ణునిలో లీనమైపోయింది. భగవంతుని దూషించిన దుర్మార్గుడు అంత సులభంగా భగవంతునియందే లీనమై 'ముక్తి'ని పొందటం ధర్మజుడు చూచినాడు. వెంటనే, ధర్మజునిలో అనేక సందేహాలు చెలరేగాయి. అటుపిమ్మట, ధర్మజుడు నారదుని చూచి, 'నారదా! ఈ ఆశ్చర్యకరమైన దృశ్యముయొక్క అంతరార్థము ఏమిటి?' అని ప్రశ్నించాడు. అప్పుడు నారదుడు, 'ధర్మరాజా! దూషణభూషనాదులు కేవలము దేహానికేగాని ఆత్మకు కావు. నీవు ఆ దేహాన్నే కృష్ణునిగా భావిస్తున్నావు. భగవంతుడు నిత్యశుద్ధుడు. కనుక, అట్టివానికి ఈ తిరస్కార పురస్కారాలేమాత్రం చెందవు. ఈ లోకంలో కొంమంది భగవంతుని దూషించి ముక్తిని పొందితే, మరికొందరు అతనిని కీర్తించి ముక్తిని పొందుతున్నారు. ఇంకొందరు మైత్రిచేత ముక్తిని పొందుతున్నారు. ఆపై కొందరు ప్రేమచేత ముక్తిని పొందుతున్నారు. భగవంతునిలో దుష్టులు అతి శీఘ్రంగా ఐక్యమౌతున్నాడు. కాని, భక్తుడు అనేక కష్టనష్టాలకు, పరీక్షలకు గురియైన తదుపరి ఐక్యమౌతున్నాడు. అయితే, వీరిద్దరి మధ్యగల వ్యత్యాసమేమిటి? భక్తుడు ప్రేమద్వారా భగవంతునిలో ఐక్యమొందటం శాశ్వతమైనది, ఆనందదాయకమైనది. కాని, దుష్టుడు భగవంతునిలో ఐక్యం కావటమనేది క్షణభంగురమైనది, ఆనందరహితమైనది. భగవంతునిలో అందరూ ఐక్యమౌతున్నారు. ఐతే, ప్రేమచేత తనను తాను అర్పించుకొన్నటువంటివాని ఐక్యత శాశ్వతము. కనుక, ఆత్మతత్త్వాన్ని సరిగా అర్థం చేసుకోవాలి.

యుద్ధము తరువాత కృష్ణుడు ద్వారకకు బయలుదేరాడు. 'ధర్మజా! నేను ద్వారక వదలి చాలా కాలమైంది. కనుక, నేను సెలవు తీసుకుంటున్నాను' అన్నాడు. కృష్ణుని మాటకు ఎవరూ ఎదురు చెప్పేవారు కాదు. రథము సిద్ధమైంది. ఇంతలో ఆ వార్త తెలిసి ఉత్తర పరుగెత్తుకొని వచ్చింది. కృష్ణుని పాదములపైబడి, 'కృష్ణా! అభిమన్యుడు మరణించినప్పటినుండి , నా గర్భములో మంటలు మండుతున్నాయి. దీనికి కారణం నాకు తెలియదు. కనుక, నీవిప్పుడు ద్వారకకు పోవటానికి వీలులేదు. నేను ప్రసవించే వరకు నీవిక్కడ వుండే తీరాలి. ఈ గర్భమునకు ఏమైనా ప్రమాదం జరిగితే పాండవ వంశమే నిర్మూలమౌతుంది. కనుక, నీవు పోవటానికి వీలులేదు' అని గట్టిగా కాళ్ళు పట్టుకుంది. చూచారా! ఉత్తర భక్తిప్రపత్తుల వలన తక్షణమే కృష్ణుని ప్రయాణం నిల్చిపోయింది. 'ఉత్తరా! నీ ప్రసవమయ్యే వరకు నేను ద్వారకకు పోను' అని కృష్ణుడు వాగ్దానం చేశాడు. వయస్సు చిన్నదైనప్పటికీ ఉత్తర ఉత్తమ భక్తి కలిగినది. అందువలనే, అశ్వత్థామ ఆమె గర్భముపై వేసిన బ్రహ్మాస్త్రమును నిర్మూలించే నిమిత్తమై కృష్ణుడు ఆమె గర్భములో ప్రవేశించాడు. ఆమె అలసి నిద్రించే సమయములో , తన గర్భములో కృష్ణుడు చేరి ఈ పని చేస్తున్నట్లుగా దర్శించింది. అప్పటినుండి కృష్ణనామం తప్ప మరొక పదము ఆమె నోటినుండి రాలేదు. ధర్మరాజును చూచినా 'కృష్ణా!' అనేది. కుంతిని చూచినా 'కృష్ణా!' అనేది. ఇది చరిత్రలో ఎక్కడా కనిపించదు. ఆమె భావమంతా కృష్ణభావమే. ప్రసవమైన తరువాత ఆమె కుమారునికి పరీక్షిత్తని కృష్ణుడే పేరు పెట్టాడు.

ఉత్తర ఉత్తమమైన గుణవంతురాలు కనుకనే ఆమె నిమిత్తమై కృష్ణుడు తన ప్రయాణాన్నికూడా మానుకొన్నాడు. భగవంతుని హృదయాన్ని కరిగించి కదిలించే ఇట్టి భక్తిప్రపత్తులు మానవునిలో ఆవిర్భవించాలి. కేవలం మాటలచేత అతని హృదయం కరుగదు. దానిని కరిగించే శక్తిని మనం సంపాదించుకోవాలి. వెన్నైనా వేడిని చూపనిదే కరుగదు కదా!

క్రీస్తు పూర్వము 3102 సంవత్సరములో కలియుగము ప్రారంభమైంది. ఆ దినమే కృష్ణుని నిర్వాణ దినము కూడ. ద్వారకకు సమీపమునందున్న ప్రభాసక్షేత్రములో కృష్ణుడు తన దేహమును విసర్జించిన దినము. 'వినాశకాలే విపరీతబుద్ధిః' అన్నట్లు యాదవులయందు విపరీత బుద్ధులు చెలరేగి, ఆనాడు యాదవుల వంశమంతయూ వినాశనమొందిన దినము. పవిత్రమైన యజ్ఞము జరిపి, యజ్ఞమున ఉపయోగింపరాని పదార్థములను యాదవులు ఉపయోగించినారు. కృష్ణుడు లోకమునకు సాత్వికాహారమును అందించినాడు. వినాశకాలం సమీపించటం చేత ఈ యాదవులు మాంసాదులు భక్షించటము, మద్యపానాదులు చేయటము ప్రారంభించారు. చిన్న కారణముతోనే ప్రళయము వచ్చి యాదవులకు ఆహార పానీయములచే బుద్ధులు మత్తెక్కి వారి విజ్ఞానము శూన్యమై దైవమును మరచిపోయి ఒకరినొకరు కొట్టుకొని మరణించే పరిస్థితికి పూనుకున్నారు. ఈ అవస్థకు గురైన యాదవులలో ఆడువారు ఎంతోమంది గృహములలో మిగిలిపోయినారు. ఈ యుద్ధములో వసుదేవుడు తన ప్రాణములను వదలినాడు. బలరాముడుకూడ ప్రాణములు విడిచాడు. ఉద్ధవుడు అక్కడ చేరేసరికి పరిస్థితి చాలా భయంకరముగనున్నది. ఈ దృశ్యమును చూచి ప్రేమబంధుడైన కృష్ణుడు తన దేహమును చాలించెనేమోనని భయపడుతూ దశదిశలు కృష్ణుని దేహము కోసము గాలించాడు. ఉద్ధవునకు అర్జునుడు సహాయకారియై అన్ని ప్రాంతములకు వెళ్ళి తమ ప్రియతముడైన కృష్ణుని దేహముకోసం గాలించాడు. అక్కడ పోరాటములో ఒక్కొక్క అంగము ఒక్కొక్క రీతిగా చెల్లాచెదరై ఉండుటచే గుర్తించ లేకపోయారు. కృష్ణుడు లేని జీవితము వ్యర్థమని వీరిద్దరూ ప్రాణత్యాగము చేయుట మంచిదని తలచినారు. ఇద్దరూ యమునలో దూకుటకు ప్రయత్నము చేసినారు. అది ప్రళయ కాలము కనుక వాయువు, అగ్ని విజృంభించి వాతావరణమును తారుమారు చేసినది. వీరు సముద్రమును సమీపించగానే ఒక చెట్టు క్రింద రెపరెపలాడుతూ నీలి వస్త్రము గాలిలో తెలియాడుతున్నది. అదేమిటా యని ఉద్ధవుడు ఆశ్చర్యముగ అచ్చటికి పరుగెత్తాడు. అక్కడ చిరునవ్వులు చిందుతూ శ్రీకృష్ణుడు కాలుపై కాలు వేసుకొని యోగముద్రలో ఉన్న అద్భుత దృశ్యాన్ని చూసాడు. కృష్ణుడు తన దేహమును అంతర్ధానము చేసికొనే నిమిత్తమై సంసిద్ధముగా ఉన్నాడు. ఇట్టి సమయములో ప్రేమబంధువులు దగ్గర ఉండుట మంచిది కాదని ఉద్ధవునకు భాగవతము బోధించి అతనిని అర్జునుని తీసుకురావటానికి పంపించాడు. కృష్ణుని క్షేమమును అర్జునునికి చెప్పాలనే ఉత్సాహముతో ఉద్ధవుడు అర్జునుని చెంతకు పరుగెత్తుకొని వెళ్ళినాడు. తక్షణమే కృష్ణుడు తన దేహాన్ని చాలించాడు. ఉద్ధవార్జునులు ఇద్దరూ అక్కడికి వచ్చేటప్పటికి అక్కడ దేహము లేదు. కృష్ణుడు అంతర్ధానమైపోయినాడని, తన కార్యమును పూర్తి చేసుకొని దేహము చాలించుకొన్నాడనుకొని, దివ్యలోకమునకు వెళ్ళినాడని వారిద్దరూ గ్రహించి ద్వారకకు వచ్చినారు.

బంధుమిత్రులను, పతులను కోల్పోయిన గోపికలు, సత్యభామ, రుక్మిణి మొలగువారి రోదనలు విని అర్జునుడు, ఉద్ధవుడు భరించలేని దుఃఖములో మునిగిపోయారు. అక్కడ ఎక్కువ కాలము ఉండటము మంచిదికాదని, వారిని హస్తినాపురము తీసుకొని పోవలెనని ఆ స్త్రీల వెంట అర్జునుడు గాండీవమును ధరించి ప్రయాణమై వస్తున్నాడు. మధ్య మార్గములో ఆటవికులు వీరిపై దండెత్తివచ్చి, స్త్రీలను ఎత్తుకొనిపోవుటకు ప్రయత్నము చేసినారు. గోపికలు, సత్యభామ, రుక్మిణి అర్జునుని ప్రార్థించినారు. 'అర్జునా! రక్షించు, కాపాడు' అని కేకలు వేశారు. ధీరుడు, వీరుడైన అర్జునుడు ఖాండవ దహనమందు కృష్ణుని పక్షమున ఉండి ధీరుడై జయము సాధించిన అర్జునుడు, ఉత్తరగోగ్రహణములో శత్రువులను సాధించిన అర్జునుడు, ఈ సమయములో నారిని ఎక్కుపెట్టే శక్తి లేని బలహీనుడుగా మారిపోతున్నాడు. అప్పుడు అర్జునుడు తలుస్తున్నాడు. 'ఇంత కాలము అహంకారముచేత నేను సాధించాను అని గర్వించాను. కాని, నేను కాదు. నా హస్తము నందు కృష్ణుడు ఉండి ఈ కార్యమును సాధించాడు. పట్టినది నా హస్తముగాని అందులోని పటుత్వమంతా కృష్ణునిదే. ఈనాడు కృష్ణుడు నా హృదయమందు లేకపోవుటచే నా దేహము నిశ్శక్తితో తూలిపోతున్నది' అనే సత్యాన్ని

గుర్తించినాడు. 'పూర్వము కృష్ణుడు అంతర్యామిగ ఉండి నా చేత అన్ని కార్యములు చేయించాడు. ఈనాడు అంతర్యామి లేకపోవుటచే ఈ దేహము సంచి వలె తయారైంది' అని భావించాడు. అంతరార్థమేమనగా కృష్ణుడు ఉన్నాడు అనే దేహభ్రాంతి ఉన్నంత కాలము అర్జునునికి మనోబలము, బుద్ధిబలము, దేహబలము, సర్వబలములు చేకూరినవి. స్థూలదేహము దూరమైన తక్షణమే కృష్ణుడు తనకు దూరమైనాడని భావించటముచేత తన సర్వశక్తులు నిశ్శక్తులుగా మారిపోయినవి. కనుక, దుర్బలమైన కాయాన్ని ఆధారము చేసుకొనుట క్షేమము కాదు. భగవంతుడు నిర్గుణుడు, నిరంజనుడు. సాకారస్వరూపము ఆధారము చేసుకొని జీవించ వలసినదే. నిరంతరము హృదయములో నిరాకారత్వమునే ప్రతిష్ఠించుకొనుట ఉత్తమైన మార్గము.

భారతీయులు కృష్ణుని ప్రేమస్వరూపుడుగా అనుభవించినారు. కృష్ణుడు నిరంతరమూ యువకుడే. అతడు నిత్యయౌవనుడు. యౌవనుడు అనే మాటలోని అంతరార్థమును గుర్తించాలి. యౌవనుడంటే ధృఢకాయుడై నిరంతరము చిన్నవాడుగా కనిపించే స్వభావము కాదు. నిరంతరమూ విచార రహితుడై ఆనందస్వరూపుడై, శాంతిస్వరూపుడై, నిరంతరము చిరునవ్వులు చిందించేవాడే నిత్యయౌవనుడు. ఆనందమే దేహానికి ఆరోగ్యము. దీనిని బట్టియే 'happiness is union with God' దేహముయొక్క క్షీణతకుగాని, దౌర్బల్యమునకుగాని, మన ప్రవర్తనలే మూల కారణము. ప్రవర్తనలకు యిచ్ఛయే కారణము. ఈ యిచ్ఛలకు ఆభీష్టములే ఆధారభూతములు. కనుక, ఐహికచింతల కోసము హృదయాన్ని బాధించ కూడదు. సుఖదుఃఖములు కదలిపోయే మేఘములవలె హృదయస్థాయిలో కదిలి పోతాయి.హృదయమనే ఆకాశమందు కోటికోటి నామాలనే నక్షత్రములు మినుకుమని మెరయుచుండగా, మనస్సనే పూర్ణచంద్రుడు ఆ నక్షత్రముల మధ్య ఉండినప్పుడే ఆనందమునకు అవకాశముంటుంది. మనస్సనే చంద్రుణ్ణి పూర్ణచంద్రునిగా తీర్చి దిద్దాలి. పూర్ణచంద్రుని ఆకారముతో నున్నప్పుడు దివ్యత్వములనే భావములను అభివృద్ధిగావించుకొనుటకు అవకాశ ముంటుంది. చిత్తమును శుద్ధి చేసుకొని నీతినిజాయితీలను లక్ష్యమునందుంచుకొని కృష్ణుని ఆదర్శములను ఆచరించి ఆనాటి రామరాజ్యముగ, ధర్మరాజ్యముగ భారత దేశమును తీర్చిదిద్దాలని ఈ ఆదేశము.

## ప్రార్థన

కస్తూరీ తిలకం లలాటఫలకే వక్షస్తలే కౌస్తుభం
నాసాగ్రే నవమౌక్తికం కరతలే వేణుం కరే కంకణం
సర్వాంగే హరిచందనంచ కలయన్ కంఠేచ ముక్తావళీమ్
గోపస్త్రీ పరివేష్టితో విజయతే గోపాలచూడామణీ.

శ్రీకృష్ణుని నుదిటియందున్న కస్తూరీ తిలకము జ్ఞాననేత్రమునకు చిహ్నము. అంతర్దర్శనము చేయగల శక్తి దాని కున్నది. శివుని ఫాలలోచనము వంటిది. కస్తూరి అంటే ఇంద్రియాతీతమైన జ్ఞానము, వివేకము. ఆనందస్వరూపుడైన శ్రీకృష్ణుని హృదయంలో నిండివున్న నిర్మలానందమే కౌస్తుభంగా సూచించారు. తరువాత నాసాగ్రమందున్న నవమౌక్తికం. పరమాత్ముని వైభవమును యేకాగ్ర దృష్టితో సాధించగల విజయమును అది సూచిస్తున్నది. నాసాగ్రమున దృష్టి నిలిపి ధ్యానం చేయాలని యోగవిద్యావిశారదులు చెబుతున్నారు. వర్షబిందువు ముత్యంగా మారుతుందని హిందూ పురాణాలు చెబుతున్నవి. ఆకాశం నుంచి దైవ ప్రసాదంగా కురిసే నిర్మలమైన తొలకరి చినుకుల కోసం తపించిపోయే శుక్తి వానిని మ్రింగుతుంది. ఆ వర్ష బిందువులే మౌక్తికములుగా తయారు కాగలవు. స్వచ్ఛమైన, సత్యమైన వస్తువు కోసం మానవ హృదయం ఆరాటం చెందినప్పుడు ఎటువంటి మార్పు పొందుతుందో మౌక్తికం సూచిస్తున్నది.

తరువాత వర్ణించిన అంశం వేణువు. విషయ వాసనలు లేకుండా బోలుగా వున్న వెదురుగొట్టంలా మార్పు

చెందాలనీ, వొంపులు లేకుండా సూటిగా కోరికల ఆటంకాలు లేకుండా వుండాలనీ కరతలంలో వున్న వేణువు తెలుపుతున్నది. ఈవిధంగా మీరు తయారైనప్పుడు పరమాత్ముని శ్వాస మీలో సంచారం చేసి ఆత్మలను మేలుకొల్పగల మధురగానం వెలువడుతుంది.

కరే కంకణం అనే వర్ణనలో కంకణం ఏమిటి? నిఘంటువులో చెప్పే అర్థం ప్రకారం అది బంగారపు గాజు కాదు. మనిషి ఒక దీక్ష పూనినప్పుడు చేతికి కంకణం కట్టుకుంటాడు. శ్రీకృష్ణుడు పూనిన దీక్ష యేమిటని మీరు ఆశ్చర్యపడుతున్నారేమో! అది యేమిటో చెబుతున్నాను. మానవజాతి సముద్ధరణకోసం ఆయన మూడు దీక్షలు పూనినట్లు భగవద్గీత తెలుపుతున్నది. 'పరిత్రాణాయ సాధూనాం వినాశయచ దుష్కృతాం, ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే' అన్నది మొదటి దీక్ష. ఎవరు తనను అనన్య చింతతో ధ్యానిస్తారో వారి యోగ క్షేమాలన్నీ తాను వహించ గలనన్నది రెండవది. ఇతరమైన కర్మలనూ, కర్తవ్యములనూ తనకు సమర్పించిన వారిని అన్ని పాపములనుండి విముక్తులను చేసి మోక్షం ప్రసాదించగలనన్నది మూడవది. ఆయన ధరించిన కంకణము ఈ మూడు దీక్షలనూ సూచించును.

సర్వాంగములూ హరిచందనపు పూతతో శోభించునట్లు తరువాత పంక్తిలో ఉన్నది. పీతాంబర ధారియై శరీరమంతా పచ్చని రంగుతో సువాసనలు వెదజల్లే హరిచందనం పూసికొన్నాడు. పచ్చరంగు ప్రకృతికి సంకేతం. ప్రకృతిని ఆకర్షణీయమైన వస్త్రంగా ఆయన ధరిస్తున్నాడు. ప్రకృతి అనే వేషం ధరించి ఆయన దర్శనం అనుగ్రహిస్తున్నాడు. ఇష్టం వచ్చినప్పుడు వేషం వేసుకోగలడు, తీసివేయగలడు. అది ఆయన ఆత్మమాయ. గోపాలచూడామణీ అనే సంబోధనతో శ్లోకం ముగిసింది. గోవు అంటే జీవి. శ్రీకృష్ణుడు జీవుల సంరక్షకుడు. గోవులకు శాంతిభద్రతలు ఆయన సమకూర్చగలడు. గోవులను పోషించి పెంపు చేయగలడు. విషయ ప్రపంచంలో సంచరించే యింద్రియాలు గోవులు. వానిని అదుపులోనుంచి సత్క్రమ మార్గాన నడిపి భద్రంగా కాపాడే ప్రభువు గోపాలుడు.